ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
తిరుపతి
జిల్లా వార్తలు
శుక్రవారం 11 జూలై 2025



గురుపౌర్ణమి గరుడసేవ

గురుపౌర్ణమి సందర్భంగా తిరుమలలో గురువారం రాత్రి గరుడ వాహనసేవ వైభవంగా జరిగింది. ఆహ్లాదకర వాతావరణంలో తన ఇష్టవాహనమైన గరుడుడిపై సర్వాలంకార భూషితుడై మలయప్ప స్వామి నాలుగు మాడవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, గోవిందనామ స్మరణల మధ్య గరుడుడిపై గోవిందుడు భక్తులను కటాక్షించారు. గురుపౌర్ణమి కావడంతో తిరుమల, తిరుపతి స్థానికులతో పాటు భక్తులు భారీగా మాడవీధుల్లోని గ్యాలరీల్లోకి చేరి కర్పూర నీరాజనాలతో మలయప్పస్వామిని దర్శించుకున్నారు. వాహనసేవలో కేంద్రమంత్రి బండి సంజయ్, జీయర్‌స్వాములు, బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, అదనపుఈవో వెంకయ్య చౌదరి పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

నిరసన గళం



చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో బుధవారం వైసీపీ అధినేత జగన్ పర్యటన సందర్భంగా ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫరు శివకుమార్‌పై ఆ పార్టీ మూకల దాడిని ఖండిస్తూ గురువారం తిరుపతిలో నిరసన గళం వినిపించారు. పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు.

- 8లో



తల్లులకు వందనం.. వరదయ్యపాళెం మండలం గోవర్ధనపురంలో తల్లుల కాళ్లు మొక్కుతున్న పిల్లలు

కోలాహలంగా మెగా పీటీఎం 2.0

తిరుపతి(విద్య), జూలై 10(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య సంబంధాలను బలపరిచి.. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం శుక్రవారం జిల్లాలోని పాఠశాలల్లో కోలాహలంగా జరిగింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ సారి ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లోనూ సమావేశాలు నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష అధికారుల ఆధ్వర్యంలో విద్యాశాఖ మార్గదర్శకాల ప్రకారం ఆహ్వాన కమిటీ, బడ్జెట్ కమిటీ, బడి సుందరీకరణ, పర్యావరణ పరిరక్షణ, రిసెప్షన్, సీటింగ్, విద్యార్థుల ప్రగతి నివేదికలు, స్టేజీ నిర్వహణ కమిటీలు పీటీఎం కార్యక్రమాలు నిర్విఘ్నంగా సాగాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో.. తల్లులకు రంగోలి, తండ్రులకు టగ్ ఆఫ్ వార్, పిల్లలకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథులు, తల్లిదండ్రులు, పిల్లలతో మొక్కలు నాటించి పర్యావరణ పరిరక్షణ తెలియజేశారు. ఇంకా ఫొటో డ్రీమ్, పాజిటివ్ పేరెంటింగ్ సెషన్లను నిర్వహించారు. విద్యార్థులు ఇళ్లలో ఉన్నప్పుడు తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా పిల్లలు సెల్‌ఫోన్ల వాడకాన్ని నియంత్రించాలని సూచించారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు, తద్వారా మంచి విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. చివరిగా ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులతో వ్యక్తిగతంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టులను తల్లిదండ్రులకు చూపించారు. ఏయే పాఠ్యాంశాల్లో.. ఏ స్థాయిలో ఉన్నారో చెబుతూ ఇంటివద్ద చదివించేటప్పుడు దృష్టిపెట్టాల్సిన అంశాలను విశదీకరించారు. ఇలా తల్లిదండ్రులు తమ విద్యార్థుల విద్యాంస్థలకు వచ్చి.. ఆటపాటలతో సందడిచేసి.. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో పాల్గొని.. తమ పిల్లల ప్రగతి నివేదికలు తెలుసుకుని.. వారి భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన పెంచుకుని తిరిగివెళ్లారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 3,198 ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్స్ 2.0 జరిగింది. ఈ విద్యాసంస్థల్లో మొత్తం 3,47,565 మంది విద్యార్థులు ఉన్నారని, వారితోపాటు వారి తల్లిదండ్రులు ఈ కార్యక్రమాల్లో అత్యధిక శాతం పాల్గొన్నారని అధికారులు వెల్లడించారు. తమ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు భాగస్వాములయ్యారు.

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని గుర్తించండి: కలెక్టర్

వెంకటగిరి టౌన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యాన్ని- వారు ఏ రంగంలో రాణించగలరో గుర్తించి అందుకు అనుగుణంగా విద్యా బోధన చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. వెంకటగిరిలోని మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ తులసీజ్యోతి ఆధ్వర్యంలో గురువారం జరిగిన పేరెంట్స్ - టీచర్స్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. విద్యార్థులు బట్టీపట్టే విధానం నుంచి గుణాత్మక విద్య వైపు మళ్లేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం నాణ్యమైన యూనిఫాం, షూ, బ్యాగ్, సన్న బియ్యంతో రుచికరమైన మధ్యాహ్నం భోజనం అందిస్తోందన్నారు. విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. విద్యార్థులు తల్లిదండ్రుల కష్టాన్ని, నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సూచించారు. తల్లిదండ్రులకు మ్యూజికల్ ఛైర్స్ పోటీలు నిర్వహించి విజేతలను అభినందించారు. ఈ సమావేశంలో ఎంపీపీ తనూజా, డీఈవో కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, సీఐ రమణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

మంత్రి పీఏ చెప్పారు కదా..
షాపు ఇచ్చేయండి

- ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి వైద్యాధికారిణిపై గుంటూరు వ్యక్తి ఒత్తిడి
- ఇప్పటికే రుయాలో అరకు కాఫీ షాపునకు లైసెన్స్

'మంత్రి పీఏ చెప్పారు కదా.. ఇక్కడ కూడా షాపు ఇవ్వండి.. లేదంటే నేను సీఎం పీఏగా వెళ్లే అవకాశం ఉంది.అప్పుడు నా అవసరం ఉంటుంది' అంటూ గుంటూరుకు చెందిన ఓ వ్యక్తి కొన్ని రోజులుగా ఓ మహిళా వైద్యాధికారిణిపై ఒత్తిడి చేస్తున్నారు. ప్రజాప్రతినిధుల పీఏలతో సత్సంబంధాలు పెట్టుకుని వారితో ఫోన్లు చేయించి పనులు చేసుకోవడంలో దిట్టగా పేరున్న సదరు వ్యక్తి తిరుపతి ఎస్వీఆర్ రుయా ఆస్పత్రిలో నామమాత్రపు అద్దెతో అధికార యంత్రాంగం ద్వారా 'అరకు కాఫీ' షాపు ఏర్పాటు చేసుకున్నారు. ఇదే వరసతో పక్కనే ఉన్న ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి ఎదుట కూడా అరకు కాఫీ షాపు పెట్టేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. కాఫీ షాపునకు అనుమతి ఇవ్వాలని ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన ఓ మంత్రి పీఏతో ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఫోన్ చేయించినట్టు తెలిసింది. ఇటీవల వైజాగ్ నుంచి ప్రసూతి ఆస్పత్రికి బదిలీపై వచ్చిన మహిళా వైద్యాధికారిణికి వచ్చీరాగానే ఈ వ్యవహారం ఎదురు కావడంతో ఆమె ఆందోళనలో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ విషయాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్ దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం. ఒకే ప్రాంగణంలో రెండు షాపులు ఎందుకన్నట్టుగా ఆయన చెప్పినట్టుగా తెలిసింది.

అరకుకు పెరుగుతున్న గిరాకీ : ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనులు సహజ పద్ధతుల్లో సాగుచేసే అరకు కాఫీ ఖ్యాతి ఖండాంతరాలను దాటేసింది. ఈ క్రమంలో తిరుపతిలోనూ అరకు కాఫీ షాపులు వెలుస్తున్నాయి.ఆదివాసీల పేరుతో లైసెన్సులు తీసుకుని ఇతర వ్యక్తులు ఈ వ్యాపారంలోకి దిగుతున్నారు. అరకు పేరు వాడుకుని ప్రభుత్వం నుంచి రాయితీలు పొంది దర్జాగా వ్యాపారాలు చేసుకునేందుకు బడా వ్యక్తులు సిద్ధమైనట్టు తెలుస్తోంది. ఇప్పటికే కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు ఈ షాపుల కోసం పెద్ద యెత్తున దరఖాస్తులు వస్తున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



చీరపై నేచి 'లక్ష్మీ వృక్షం' డిజైన్

చేనేతే జీవితంగా..!

వెంకటగిరి నేతన్న శ్రీనివాసులుకు రెండోసారి సంత్ కబీర్ అవార్డు

వెంకటగిరి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): చిన్నప్పుడే చేనేతపై దృష్టి పెట్టారు. ఇందులో నైపుణ్యం సాధించి.. రాణిస్తూనే ఐటీఐ మెకానికల్ డ్రాఫ్ట్‌మేన్ కోర్సు పూర్తి చేశారు. శ్రీహరికోటలో ఓ ఉద్యోగం కోసం ప్రయత్నించి విఫలమయ్యారు. ఆ తర్వాత పూర్తి సమయాన్ని చేనేత పనికే కేటాయించారు. చీరలపై జాందాని వర్కు చేయడంలో ప్రావీణ్యం సాధించారు. ఇలా చేనేతనే జీవితంగా మార్చుకుని.. పూర్తి సమయం కేటాయించారు వెంకటగిరికి చెందిన నేతన్న లక్కా శ్రీనివాసులు. అందుకే ఇప్పుడు రెండోసారి ఆయన సంత్ కబీర్ జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. 'దేశంలో ఎక్కడాలేని జాందాని పనిపై దృష్టి సారించా. ఆపోజిట్ ఎగస్ట్రావర్స్ ఇంటర్‌లాక్ సిస్టం విధానాన్ని మగ్గంపై ఉంచి చీర్లపై అద్భుతమైన డిజైన్లు సృష్టించా. 2013లో గోకుల బృందావనం అనే వాల్ హ్యాంగింగ్ నేయగా.. అది జాతీయ అవార్డుకు ఎంపికైంది. 2015లో ఈ అవార్డును ప్రధాని చేతుల మీదుగా అందుకున్నా. భగవద్గీత శ్లోకాలను చీరపై నేసి ఇస్కాన్ టెంపుల్‌కు అందించా. గతంలో చీర నేచేది ఒకరు.. అవార్డు పొందేది మరొకరుగా ఉండేది. ఆ విధానంపై నేను అప్పటి కేంద్ర మంత్రి ఎం.వెంకయ్య నాయుడు దృష్టికి తీసుకెళ్లి అర్హులకే అవార్డు అందేలా పరీక్షా విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చాం. ఇప్పుడు అవార్డుకు ఎంపికైన 'లక్ష్మీ వృక్షం' చీర తయారు చేయడానికి నాలుగు నెలల సమయం పట్టింది. దీంతో పాటు మరో రెండు చీరలు పంపినా, అవి అర్హత సాధించలేదు' అని లక్కా శ్రీనివాసులు వివరించారు. ప్రభుత్వం ప్రోత్సహిస్తే ఇలాంటి అద్భుతాలు మరెన్నో చేసి చూపుతామన్నారు.



శ్రీనివాసులును సన్మానిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే కురుగొండ్ల

'లక్కా'కు సన్మానం

వెంకటగిరి టౌన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): 'సంత్ కబీర్ జాతీయ అవార్డుకు ఎంపికైన వెంకటగిరి బొప్పాపురం సాలికాలనీకి చెందిన లక్కా శ్రీనివాసులును గురువారం కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సన్మానించారు. సంత్ కబీర్ అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. వెంకటగిరి చీరలకు ప్రపంచ ఖ్యాతి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహారావు, టీడీపీ నాయకులు బీరం రాజేశ్వరరావు, శ్రీరామదాసు గంగాధర్, పోలంరెడ్డి వెంకటరెడ్డి, అవ్వారు శ్రీనివాసులు, చంద్రమౌళి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృత్తి- విద్యా కోర్సులకు దరఖాస్తు చేసుకోండి

తిరుపతి అర్బన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): వృత్తి-విద్యా కోర్సులకు షెడ్యూల్ కులాల యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలని సెట్విన్ సీఈవో మోహన్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వంద శాతం శిక్షణ, ఉపాధి, ఉచిత భోజనం.. వసతితో 38 రోజుల శిక్షణకు 10వ తరగతి విద్యార్హతగా పేర్కొన్నారు. 15 నుంచి 45సంవత్సరాల వరకు వయోపరిమితి, చివర్లో సర్టిఫికెట్లు అందజేస్తారని తెలిపారు. ఈనెల 14వరకు దరఖాస్తులకు గడువు ఉందని తెలిపారు. ఆసక్తిగల షెడ్యూల్ కులాల యువతీ, యువకులు పేర్ల నమోదుకు, మరిన్ని వివరాల కోసం 79811 55147, 97014 40274, 97034 37472 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

స్విమ్స్‌లో యూజీ కోర్సులకు నోటిఫికేషన్

తిరుపతి(వైద్యం), జూలై 10(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో పలు యూజీ కోర్సులకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్ల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ నర్సింగ్ 110 సీట్లు, బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ(బీపీటీ) 55 సీట్లు, బీఎస్సీ అలైడ్ హెల్త్ సైన్సెస్ పారా మెడికల్(86) సీట్లు ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. వీటికి ఇంటర్ బైపీసీతో సమానమైన అర్హత, ఏపీఈఏపీసీఈటీ ర్యాంకులో మెరిట్ ప్రాతిపదికన సీట్లు భర్తీ చేస్తామన్నారు. వీటికి సంబంధించిన దరఖాస్తులను ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా లేదా స్విమ్స్ వెబ్‌సైట్ నుంచి పొందాలని సూచించారు.



కేంద్ర బృందంచే చెత్త నిర్వహణ ప్లాంట్ల పరిశీలన

తిరుపతి, జూలై10(ఆంధ్రజ్యోతి): తిరుపతికార్పొరేషన్ నిర్వహిస్తున్న తూకివాకం, రామాపురం చెత్త నిర్వహణ ప్లాంట్లను కేంద్ర గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి (అమృత్ పథకం) ఇషా కాలియా, సాంకేతిక సలహాదారు రోహిత్ కక్కర్, రాష్ట్ర కార్యదర్శి సురేష్ కుమార్ గురువారం కమిషనర్ మౌర్య తదితరులతో కలిసి పరిశీలించారు. మురుగునీటిని శుద్ధి చేసి ప్రైవేటు ఫ్యాక్టరీలకు, పంటలకు సరఫరా చేస్తున్నామని.. రామాపురంలో ఎరువునుపొలాలకు, ప్లాస్టిక్ వ్యర్థాలను సిమెంట్ ఫ్యాక్టరీలకు విక్రయిస్తామని కమిషనరు వివరించారు.

నలుగురు నకిలీ విజిలెన్స్ అధికారుల అరెస్టు

- డమ్మీ తుపాకీ, రూ.1.26 లక్షల స్వాధీనం

రేణిగుంట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అధికారులమంటూ వడమాలపేట మండలం ఎస్.వి.పురం వీఆర్వో భూపతిని బురిడీ కొట్టించి రూ.1.5 లక్షలు కాజేసిన నలుగురిని అరెస్టు చేసినట్లు గాజులమండ్యం సీఐ మంజునాథ రెడ్డి గురువారం తెలిపారు. రేణిగుంట మండలం తిమ్మయ్యపల్లికి చెందిన కృష్ణంరాజు ఇచ్చిన సమాచారం మేరకు రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకొని ముఠాగా ఏర్పడ్డారు. ఈక్రమంలో గత నెల 28న ఉదయం రేణిగుంట మండలం జీవాగ్రంలోని వీఆర్వో భూపతి ఇంటికి ఏలూరుకి చెందిన కాశీవిశ్వేశ్వరయ్య, తెలంగాణ రాష్ట్రం మంచిర్యాలకు చెందిన సంతోష్, శంషుద్దీన్, తిరుపతికి చెందిన నరేంద్ర విజిలెన్స్ అధికారులమంటూ వచ్చారు. ఆయనపై ఫిర్యాదులు వచ్చాయంటూ బెదిరించడంతో, ఆందోళన చెందిన భూపతి రూ.1.5 లక్షలు ఇచ్చారు. మిగిలిన మొత్తాన్ని సర్దుబాటు చెయ్యాలని బెదిరించి వెళ్లారు. వారం తర్వాత పదే పదే డబ్బుల కోసం ఫోను చేయడంతో ఆయన గాజులమండ్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బుధవారం ఉదయం డబ్బు కోసం భూపతికి నకిలీ అధికారులు ఫోన్ చేశారు. పోలీసులు సూచించిన ప్రకారం తూకివాకం జంక్షన్‌కు వచ్చి డబ్బు తీసుకోవాల్సిందిగా భూపతి వారికి చెప్పాడు. అక్కడికి చేరుకున్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిచ్చిన సమాచారంతో ఈ ముఠాకు కీలకమైన నిందితుడిని నరేంద్రను తిరుపతిలో అరెస్ట్ చేశారు. వీరి నుంచి డమ్మీ తుపాకీ, 5 సెల్ ఫోన్లు, రూ.1.26 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. గురువారం సాయంత్రం జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

అతిథి టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతిరూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలం జూపార్క్‌రోడ్డులోని ఉదయమాణిక్యం మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో గెస్ట్ టీచర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ కె.రేష్మ పేర్కొన్నారు. హిందీ(పీజీటీ), ఇంగ్లీషు(టీజీటీ) పోస్టులకు అర్హులైన మహిళా అభ్యర్థులు ఈనెల19వ తేదీలోపు పాఠశాలలో దరఖాస్తులు అందించాలని కోరారు. వివరాలకోసం 9000783185 ఫోన్‌నెంబరులో సంప్రదించాలని కోరారు.

వైభవంగా ధ్వజారోహణం



ధ్వజారోహనం నిర్వహిస్తున్న దృశ్యం

రామచంద్రాపురం, జూలై 10(ఆంధ్రజ్యోతి): రామాపురం మహాభారత ఉత్సవాలకు నాందిగా గురువారం వేకువజామున 4గంటలకు వేదమంత్రోచ్ఛరణల మధ్య ధ్వజారోహణం కార్యక్రమా న్ని వేదపండితులు నిర్వహించారు. తొలుత ద్రౌపదీ సమేత ధర్మరాజుల మూలమూర్తులకు తిరుమంజనం జరిపించారు. అనంతరం ఆలయంలో వివిధ పూజలు చేసి ధ్వజస్తంభానికి గరుడ ధ్వజపటాన్ని ఎగురవేశారు. 27వ తేదీ వరకు మహాభారత ఉత్సవాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి



అనుపల్లిలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

రామచంద్రాపురం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పాలనలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ ఎంపీపీ బిందుమాధవి అన్నారు. మండలంలోని అనుపల్లి గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుపరిపాలన అందించడం చంద్రబాబుకే సాధ్య మన్నారు. అనంతరం ఇంటింటికీ ఏడాదిలో చేసిన అభివృద్ధి పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు రమణారెడ్డి, నాయకులు దేవరాజులు, వెంకటేష్‌నాయుడు, విజయకుమార్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

చిట్టిబాబుకు ఎమ్మెల్యే నాని నివాళులు

రామచంద్రాపురం, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పరమాల హరిజనవాడకు చెందిన టీడీపీ కార్యకర్త చిట్టిబాబు ఇటీవల ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన అంత్యక్రియలకు ఎమ్మెల్యే పులివర్తి నాని గురువారం హాజరై నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేశవులునాయుడు, తిరుమలరెడ్డి, జనార్దనచౌదరి, హరిప్రసాద్ పాల్గొన్నారు.

పండుగ వాతావరణంలో పాఠశాలల్లో పీటీఎం

పాకాల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాఠశాలలు, కళాశాలల్లో గురువారం పండుగ వాతావరణంలో మోగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) జరిగింది. ఆయా పాఠశాలల్లో జూనియర్ కళాశాలల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు సమావేశమయ్యారు. మెరుగైన విద్యాబోధనకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, సంక్షేమ పథకాల గురించి వివరించారు. బాలుర జూని యర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ సంతోష్‌సాయి పాల్గొన్నారు. ఎంఈవోలు బాబ్జీ, లింగయ్య పలు పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాలలో పాల్గొన్నారు. జూనియర్ బాలికల కళాశాలలో డాక్టర్ ఎన్‌సీ రామచంద్రారెడ్డి, ఆర్వీ ప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ కె.సుధాకరయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

పాకాల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహక బహు మతులు అందజేశారు. గురువారం కళాశాలలో జరిగిన ఓ కార్య క్రమంలో లయన్ కుప్పుస్వామినాయుడు సహకారంతో వెన్నెల, మౌనికలకు రూ.10వేల చొప్పున అందజేశారు. లయన్స్‌క్లబ్ సభ్యుల సహకారంతో పేద విద్యార్థులకు యూనిఫాం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రెడ్డిరామరాజు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు కేఎన్ తులసీరామన్, రామయ్య, కేఎస్ మస్తాన్, ఆర్వీ ప్రసాద్, దొరస్వామినాయుడు, ఏఎంసీ చైర్మన్ కె.సుధాకరయ్య, అంబేడ్కర్ భవన కమిటీ అధ్యక్షుడు జి.ఆంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

పాకాల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇన్‌ఫెంట్ జీసస్ పాఠశాలలో గురువారం ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహిం చారు. ఈ ఏడాది అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ప్రత్యేకంగా పుష్పాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పాఠశాలలోని చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఫాదర్ ఆంతోనిరాజ్, ప్రధానోపాధ్యాయులు రెడ్డిలత, షకీలా, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాణ్యమైన బోధన అందించాలి

ఎర్రావారిపాళెం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగునంగా ఉపాధ్యాయులు నాణ్యమైన బోధన అందించాలని ఎంఈవో బాల సుబ్రమణ్యం కోరారు. నెరబైలు మోడల్ ప్రాథమిక పాఠశాలో జరిగిన పీటీఎం సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం మొదటి, ద్వితీయ స్థానాలు పొందిన విద్యార్థులకు రూ.10వేల నగదు పారితోషకాన్ని ఎమ్మెల్యే నాని పంపగా పార్టీ నాయకులు అందించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాళ్లు సరళ, పరిమళ, ప్రధానోపాధ్యాయులు సుబ్రమణ్యం, చంద్రశేఖర్, శ్రీహరి తదితరుల పాల్గొన్నారు. కాగా మండలంలోని 46 పాఠశాలల్లో తల్లిదండ్రుల-ఉపాధ్యాయుల సమావేశాలు పండుగల వాతావరణంలో జరిగాయి.

నానీని కలిసిన సింగిల్ విండో అధ్యక్షుడు

ఎర్రావారిపాళెం, జూన్ 10(ఆంధ్రజ్యోతి); ఎర్రావారిపాళెం సింగిల్ విండో అధ్యక్షుడుగా ఎంపికైన శిరివేలు రఘునాథ పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే పులివర్తి నానీని రఘనాథ రిసార్ట్స్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం కలిసి ధన్యవాదాలు తెలిపారు. నాయకులు దేశిరెడ్డి రఘునాథ, మహేష్‌నాయుడు, మధు, తలకోన ట్రస్టు చైర్మన్ సోమనాథరెడ్డి, శివరామిరెడ్డి, విశ్వనాథరెడ్డి, నాగరాజ పాల్గొన్నారు.

జిల్లా అధికారులతో సీఎస్ సమీక్ష

తిరుపతి(కలెక్టరేట్), జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అమరావతి నుంచి వర్చువల్ విధానంలో పలు అంశాలపై జిల్లా అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్ పాల్గొన్నారు. శ్రీకాళహస్తి బీసీ సంక్షేమ హాస్టల్లో ఫుడ్ పాయిజన్‌పై ఆరా తీశారు. సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకున్నామని కలెక్టర్, జేసీ ఆయనకు వివరించారు.

చంద్రగిరి

శాస్త్రోక్తంగా దక్షిణామూర్తికి తిరుమంజనం



రామచంద్రాపురం: జూలై 10 (ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి సందర్భంగా రాయలచెరువుకట్ట భవాని జలకంఠేశ్వర ఉపాలయంలో వెలసిన గురుదక్షిణామూర్తికి గురువారం తిరుమంజనం జరిగింది. వేదపండితులు యాగశాలలో చండీ, మృత్యుంజయహోమాలు నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి దక్షిణామూర్తికి ప్రత్యేక అలంకారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉభయదారులుగా కావ్య, వేణుగోపాల్‌నాయుడు దంపతులు వ్యవహరించారు.

విద్యలో ఏపీని అగ్రస్థానంలో నిలుపుతాం : నాని

రామచంద్రాపురం, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్రంలో విద్యను అగ్రస్థానంలో నిలపడమే ధ్యేయంగా మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. కుప్పం బాదూరులో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాన్ని గురువారం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ రాష్ట్రం అమలు చేయని విధంగా ఒక కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం అమలు చేశామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తా మన్నారు. జగన్ హయాంలో విద్యార్థులకు నాసి రకం కిట్లు ఇస్తే తమ పాలనలో నాణ్యమైన సామగ్రి అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఇందిరమ్మ, ఎంఈవో మార్కొండయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, మాజీ ఎంపీపీ కేశవులునాయుడు, జనార్ధనచౌదరి, హరిప్రసాద్, జేడీ జగన్, ఉమాపతి నాయుడు, నరసింహారెడ్డి పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

పండుగలా మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్

తిరుపతిరూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో గురువారం మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌ని వేడుకగా నిర్వహించారు. విద్యార్థులకు పలకలు పంపిణీ చేశారు. అవిలాల వేదాంతపురం (ఏవీపురం) ఎంపీపీ పాఠశాలలో నిర్వహించిన సమావేశానికి సర్పంచ్ చెరుకుల జనార్ధన్‌యాదవ్, ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి, ఎంఈవో-2 శంకరయ్య తదితరులు హాజరయ్యారు. ఎంపీపీ మాట్లాడుతూ పాఠశాలకు ప్రహరీ ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు.

తుమ్మలగుంట జెడ్పీహైస్కూల్లో..

తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. స్థానిక టీడీపీ నేతలు దొడ్ల కరుణాకర్‌రెడ్డి, పార్లపల్లి భరత్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి తొలి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు రూ.1500, రూ.వెయ్యి, రూ.500 చొప్పున బహుమతులు, గతేడాది టెన్త్‌లో టాపర్లుగా నిలచిన మొదటి ముగ్గురు విద్యార్థులకు రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేల చొప్పున నగదుతోపాటు జ్ఞాపికలు అందజేశారు.



తుమ్మలగుంట జెడ్పీహైస్కూల్‌లో పూర్వ విద్యార్థులకు నగదు బహుమతి అందిస్తున్న కరుణాకర్‌రెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి తదితరులు

అంతా బాగుంది..

తల్లిదండ్రులు మధ్యాహ్న భోజనం రుచి చూసి.. నాణ్యతతోపాటు రుచికరంగా ఉందన్నారు. విద్యార్థిమిత్ర కిట్స్ బాగున్నాయని, ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నారని మంత్రి నారా లోకేశ్‌కి కృతజ్ఞతలు తెలిపారు. హెచ్ఎం భారతి, టీడీపీ నాయకులు తులసీరామిరెడ్డి, చెంచుశేఖర్, రామ్‌ప్రసాద్, ఉమాపతి, కృష్ణ, శ్రీను, పేరెంట్స్ గ్రామస్తులు పాల్గొన్నారు.

చంద్రగిరి ప్రభుత్వ పాఠశాలలో పేరెంట్స్ టీచర్స్ మీటింగ్



విద్యార్థి తల్లితండ్రులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్న దృశం

చంద్రగిరి, జూలై 10(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో గురువారం పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం)ను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులకు క్రీడ పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు భాస్కర్‌బాబు, లలితకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని మొండికాల్వ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు విద్యాసామగ్రితోపాటు పాఠశాలకు భరతమాత చిత్రపటం దాతల సహకారంతో కేశవ సేవా సమితి ఆధ్వర్యంలో అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాకాటి తులసి ప్రసాద్‌రెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు త్యాగరాజులు, విశ్రాంత ఉపాధ్యాయులు పరంధామ రెడ్డి, కేశవ సేవా సమితి సభ్యులు తిరుమలేష్, ప్రణవ్, రూపేంద్ర పాల్గొన్నారు.

పిల్లలను మొబైల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలి



జేసీ శుభం బన్సల్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉపాధ్యాయులు తదితరులు

తిరుచానూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లలను మొబైల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలని జాయింట్ కలెక్టర్ శుభంబన్సల్ అన్నారు. తిరుచానూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్త కాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. అనంతరం పాఠశాలలో గ్రీన్ పాస్ పోర్టు ద్వారా చెట్లను పెంచిన విద్యార్థులకు బహుమతులు అందిం చారు. విద్యలో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మురళి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌పీఏల రుణమాఫీలో బీజేపీ సూత్రధారులు ఎవరు?

● కేంద్ర మాజీమంత్రి చింతామోహన్



మీడియాతో మాట్లాడుతున్న చింతామోహన్

తిరుపతి (ఆటోనగర్), జూలై10(ఆంధ్రజ్యోతి): దేశంలో బీజేపీ ప్రభుత్వం ఎన్‌పీఏల రుణ మాఫీలో లక్ష కోట్లకుపైగా అవినీతికి పాల్పడిందని, ఈ అవినీతిలో ఆ పార్టీకి చెందిన సూత్రధారులు ఎవరు అనే విషయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్‌షాలు బహిర్గతం చేయాలని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో బడా కార్పొరేట్ల మొండి బకాయిలు రూ 14.50 లక్షల కోట్లు రుణ మాఫీ చేసిందన్నారు. ఈ రుణ మాఫీలో అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు 10శాతం ముడుపులు తీసుకున్నారని ఆరోపించారు. రుణ మాఫీ పొందిన వారిలో అధిక సంఖ్యలో గుజరాత్‌కు చెందిన వారు వున్నారని పేర్కొన్నారు. జాతీయ బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతులు, ఉద్యోగులు, చిరువ్యాపారులకు రుణమాఫీ చేయని బ్యాంకులు కార్పొరేట్లకు ఎన్‌పీఏ రూపంలో ఎలా రుణమాఫీ చేశారని ప్రశ్నించారు. మాజీ సీఎం జగన్ బంగారు పాళెం పర్యటన సమయంలో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ శివకుమార్‌పై వైసీపీ నాయకులు దాడిచేయడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. నాయకులు యార్లపల్లి గోపీ గౌడ్, రవి,తేజోవతి, మునిశోభ, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురు స్మగ్లర్ల అరెస్టు

22 ఎర్రచందనం దుంగలు

మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం



పట్టుబడ్డ స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, జూలై 10(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా సానిపాయ రేంజ్ అటవీప్రాంతంలో గురువారం టాస్క్‌ఫోర్సు పోలీసులు కూబింగ్ నిర్వహించి నలుగురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. 22 ఎర్రచందనం దుంగలలతో పాటు మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఎస్ఐ మురళీధర్‌రెడ్డి బృందం గురువారం అన్నమయ్య జిల్లా సానిపాయ రేంజ్‌లో కూంబింగ్ నిర్వహిస్తుండగా మూడు ద్విచక్ర వాహనాలు వారి కంటపడ్డాయి. అయితే పోలీసులను చూసి వారు పారిపోయేందుకు యత్నించారు. పోలీసులు వెంబడించి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. అక్కడ పరిశీలించగా 22 ఎర్రచందనం దుంగలు కనిపించాయి. పట్టుబడిన వారు అన్నమయ్య జిల్లావాసులుగా గుర్తించారు. స్మగ్లర్లతో సహా ఎర్రచందనం దుంగలను తిరుపతిలోని టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతుల పట్ల జగన్‌కు చిత్తశుద్ధిలేదు :టీడీపీ



తిరుపతి(ఆటోనగర్), జూలై10(ఆంధ్రజ్యోతి): రైతుల పట్ల మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు చిత్తశుద్ధి లేదని టీడీపీ తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు నరసింహయాదవ్, తిరుపతి డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునిక్రిష్ణ వెల్లడించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గురువారం వారు మీడియాతో మాట్లాడుతూ మామిడి రైతులను ఆదుకోవడానికి వచ్చిన జగన్ రైతులకు ఆర్థికంగా భరోసా ఇవ్వకుండా అబద్ధాలు చెప్పి పారిపోవడం శోచనీయమన్నారు. కాన్వాయ్ కింద మామిడి కాయలు పోయించుకొని తొక్కించి రైతుల మెప్పు పొందాలనుకోవడం సిగ్గుచేటన్నారు. ఇకనైనా కుట్ర బుద్దులు మానుకోవాలని విజ్ఞప్తిచేశారు. టీడీపీ నాయకులు కరాటే చంద్ర, సుబ్బుయాదవ్, శంబోల హరినాథ్, రామారావు పాల్గొన్నారు.

ఉరుసు ప్రారంభం

భక్తిశ్రద్ధలతో గంధం ఊరేగింపు

పాకాల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక హజరత్ షేక్ ఫరీద్ మస్తాన్ ఔలియా బాబా 105వ ఉరుసు ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. రాత్రి దర్గా వద్ద నుంచి భక్తిశ్రద్ధలతో గంధం ఊరేగింపు ఎమ్మెల్యే పులివర్తి నాని చేతులమీదుగా ప్రారంభించారు. బాబా దర్గా వద్ద ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరించిన వాహనంపై గంధం వుంచి ఫకీరు వాయిద్యాలు, బ్యాండు సెట్ వాయిద్య బృందంతో పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా దర్గా పరిసరాలలో ప్రత్యేక చలువ పందిళ్లు వేసి విద్యుత్ దీపాలంకరణలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు ఏర్పాటు చేసిన దుకాణాలతో సందడి నెలకొంది. హిందూముస్లింలు దర్గావద్ద బూందీ నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఖవ్వాళీ గాయకులు నిర్వహించిన పాట కచ్చేరి అందరినీ ఆకట్టుకుంది. శుక్రవారం రాత్రి 9 గంటలకు అంగరంగ వైభవంగా ఉరుసు ఉత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గంధం సమర్పిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

భక్తిశ్రద్ధలతో గురు పౌర్ణమి



చంద్రగిరిలో సాయిబాబాను దర్శించుకుంటున్న తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి

చంద్రగిరి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాయిబాబా ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చంద్రగిరిలోని షిరిడి సాయిబాబా మందిరంలో ఉదయం సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. తొండవాడ స్వర్ణముఖినది ఒడ్డున వెలసిన సాయిబాబా ఆలయంలో విశేష పూజలు చేశారు. భక్తులను అన్నదానం చేశారు. చంద్రగిరిలో కొలువైన శిరిడి సాయిని తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు దివాకర్ రెడ్డి ని ఘనంగా సత్కరించారు. అదేవిధంగా ఎమ్మెల్యే పులివర్తి నాని సాయంత్రం సాయిబాబాను దర్శించుకున్నారు. ఎమ్మెల్యేకు టీడీపీ నాయకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాస శిక్షణలో పట్టాభిరామ్ ప్రత్యేక ముద్ర



పట్టాభిరామ్ రచించిన పుస్తకాలతో కౌటిల్య విద్యార్థులు, పక్కన సుధాకర్‌రెడ్డి, శ్రీధర్

తిరుపతిరూరల్, జూలై10(ఆంధ్రజ్యోతి): వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాల పెంపు శిక్షణలో దివంగత ప్రముఖ సైకాలజిస్ట్ బీవీ పట్టాభిరామ్ తనదైన ముద్ర వేశారని సైకాలజిస్ట్ ఎన్‌బీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఎమ్మార్‌పల్లె కూడలిలోని కౌటిల్య ఇన్‌స్టిట్యూట్‌లో గురువారం పట్టాభిరామ్ సంతాపసభ ని నిర్వహించారు. పోటీపరీక్షలకు ప్రిపేర్‌అవుతున్న విద్యార్థులు, సంస్థ డైరెక్టర్ శ్రీధర్, అధ్యాపకులతో ఆయన కలసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, యువత, వివిధవర్గాల ప్రజలకు వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాలపెంపునకు ఆయన ఎనలేని కృషి చేశారని కీర్తించారు. సంస్థ డైరెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసంపై ఆయన రూపొందించిన పుస్తకాలను నేటి యువత, విద్యార్థులు అధ్యయనం చేయాలని ఆకాంక్షించారు. ప్రతిభచాటిన విద్యార్థులు సత్య పృథుల, రేష్మాప్రియ, సాయిగీర్వాణి, అరుణకుమార్‌లకు పట్టాభిరామ్ రచించిన పుస్తకాలను బహుమతిగా అందించారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సరస్వతి శిశుమందిర్‌లో వ్యాస పూర్ణిమ

తిరుపతి(విద్య), జూలై 10(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేకాలనీలోని సరస్వతి శిశుమందిర్‌లో వ్యాసపూర్ణిమ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. సంస్కృత విద్యాపీఠం డీన్ ఆచార్య వేదాంతం విష్ణుభట్టాచార్య ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వ్యాస పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాస పూర్ణిమనాడు గురువులను పూజించడం సనాతన సంప్రదాయమన్నారు. ఈ కార్యక్రమాల్లో పాఠశాల కార్యదర్శి రవిశంకర్, పాఠశాలు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జనార్దన్‌చౌదరికి అభినందనల వెల్లువ



రామచంద్రాపురం, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఆర్‌సీపురం సింగిల్ విండో చైర్మన్‌గా చేకూరి జనార్దన్‌చౌదరిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయనకు మండల టీడీపీ నాయకులు అభినందనలు తెలిపారు. కమ్మకండ్రిగ గ్రామానికి చెందిన జనార్దన్‌చౌదరి పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడినందుకు ఈ పదవి వచ్చిందని పలువురు కొనియాడారు. జనార్దనచౌదరి మాట్లాడుతూ తనకు ఈ పదవి రావడానికి సహకరించిన ఎమ్మెల్యే నానీకి కృతజ్ఞతలు తెలిపారు.

మల్లంగుంట సింగిల్‌విండో చైర్మన్‌గా మధుశేఖర్



తిరుచానూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం మల్లంగుంట సింగిల్‌విండో చైర్మన్‌గా వేమూరు గ్రామానికి చెందిన చెరుకూరి మధుశేఖర్ నియమితులయ్యారు. ఈనేపథ్యంలో గురువారం ఎమ్మెల్యే పులివర్తి నాని పీఏసీ చైర్మన్ మధుశేఖర్‌తో పాటు సభ్యులు మోహన్‌రెడ్డి, చిరంజీవులను అభినందించారు. అలాగే పీఏసీ చైర్మన్‌గా నియమితులైన చెరుకూరిమధుశేఖర్, సభ్యులను టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అమిలినేని మధు, తిరుచానూరు టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కిషోర్‌రెడి, టీడీపీనాయకులు గణపతినాయుడు, సురేంద్రనాయుడు, సాయి రాయల్, హరేరామ్‌రెడ్డి, వాసు, జనార్దన్ తదితరులు అభినందించారు.

13న పద్మావతి శ్రీనివాస కల్యాణం

తిరుచానూరు, జూలై 10(ఆంధ్రజ్యోత): తిరుచానూరులోని మహాలక్ష్మి కల్యాణమండపంలో ఈ నెల 13న ఆదివారం పద్మావతి సమేత శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్నట్లు కేసీదాస్ మెమోరియల్ ట్రస్టు ప్రతినిధులు రాధాకృష్ణ, శ్రీనివాసరావు గురవారం ఓ ప్రకటనలో తెలిపారు. భగవంతునికి భక్తునికి మధ్య వారధిగా ఎన్నో ఏళ్లగా కోటి హనుమాన్ చాలీసా, సీతారామ కల్యాణం, సామూహిక వరలక్ష్మి వ్రతం వంటి ఆధ్యాత్మిక, భక్తి కార్యక్రమాలు నిర్వహిస్తున్న కేసీ దాస్ ట్రస్టు అనుబంధమైన సనాతన ధర్మ వారధి ఆధ్వర్యంలో ఈ కల్యాణం జరగనుందని పేర్కొన్నారు. కల్వకొలను శ్రీరామచంద్రమూర్తి పర్యవేక్షణలో లోక కల్యాణార్థం ఆదివారం ఉదయం 10.30గంటలకు నిర్వహించే కల్యాణోత్సవంలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదం, కల్యాణం అక్షింతలు, కంకణాలు స్వీకరించగలరని తిరుపతి విభాగం నిర్వాహకులు కోరారు.

ద్విచక్ర వాహనం నుంచి పడి మహిళ మృతి



వేంకటేశ్వరమ్మ (ఫైల్‌ఫొటో)

చంద్రగిరి, జూలై 10(ఆంధ్రజ్యోతి): శ్రీవారి మెట్టు మార్గంలో ద్విచక్ర వాహనంలో వస్తూ ప్రమాదవశాత్తు కిందపడి ఓ మహిళ మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా సంబేపల్లె మండలం పోతువాండ్లపల్లికి చెందిన హరి తన తల్లి వేంకటేశ్వరమ్మతో కలిసి బుధవారం ద్విచక్ర వాహనంపై శ్రీవారిమెట్టు వరకు వచ్చి, తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లారు. దర్శనానంతరం గురువారం ఉదయం శ్రీవారిమెట్టు నుంచి ద్విచక్ర వాహనంపై శ్రీనివాసమంగాపురం వస్తుండగా మార్గమధ్యంలో స్పీడు బ్రేకర్స్ ఉండటంతో ప్రమాదశాత్తు వేంకటేశ్వరమ్మ కిందపడింది. ఆమె తలకు తీవ్ర గాయం కావడంతో చంద్రగిరి సీహెచ్‌సీకి తర్వాత తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతిచెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతిభ పెంచేందుకే మెగా పీటీఎం

● ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు. వేదికపై ప్రముఖులు

తిరుపతి(విద్య), జూలై 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ప్రతిభ, నైతిక విలువల పెంచేందుకే మెగా పేరెంట్స్, టీచర్స్ 2.0 ఎంతో ఉపకరిస్తుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక బైరిగిపెట్టడలోని ఎంజీఎం హైస్కూల్లో మెగా పీటీఎం గురువారం జరిగింది. ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. అనంతరం విద్యార్థుల తల్లులు వేసిన రంగవల్లులను, తండ్రులకు నిర్వహించిన థగ్ ఆఫ్ వార్ పోటీలను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులపట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యారంగ ప్రమాణాలను పెంపొందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఎంతగానో కృషి చేస్తున్నారని చెప్పారు. విద్యామిత్ర కిట్లపై ఎవ్వరి బొమ్మలూ ముద్రించలేదని గతాన్ని గుర్తుచేశారు. తల్లికి వందనం పథకం కింద ఒక్కో విద్యార్థికి 13 వేల రూపాయలు వారి తల్లుల ఖాతాలో ప్రభుత్వం జమ చేసిందని వివరించారు. రుచికరమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకాన్ని గత ప్రభుత్వం నిలిపివేస్తే కూటమి ప్రభుత్వం పునరుద్ధరించిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ బాలాజీ, ఎంజీఎం హైస్కూల్ ప్రిన్సిపల్ పరంధామ నాయుడు, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, టీడీపీ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వరప్రసాద్, జనసేన నగర అధ్యక్షులు రాజారెడ్డి, ఆకేపాటి సుభాషిణి, వేదవతి రాయల్ తదితరులు పాల్గొన్నారు.

పీజీలో ఆన్‌లైన్ కోర్సులను రద్దు చేయాలి


వీసీకి వినతిపత్రం అందిస్తున్న విద్యార్థులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 10 (ఆంధ్రజ్యోతి): పీజీ స్థాయిలో నిర్బంధ ఆన్‌లైన్ కోర్సుల అమలును రద్దు చేయాలని వివిధ విద్యార్థి సంఘాలు కోరాయి. ఈ మేరకు ఎస్వీయూ వీసీ అప్పారావును కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కోర్సుకు సంబంధం లేని నాలుగు ఆన్‌లైన్ కోర్సులు స్వయం యాప్ ద్వారా ఎంపిక చేసుకోవాలని ఒత్తిడి తెస్తున్నారని గుర్తుచేశారు. ఎడెక్స్ కంపెనీతో ఒప్పందం మేరకు విద్యార్థులపై ఆన్‌లైన్ కోర్సులను రుద్దుతున్నారని వివరించారు. ఇలా ఒక్కో విద్యార్థి నుంచి రూ. 4 వేలు వసూలు చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌ఓ జిల్లా కార్యదర్శి ఉష, ఎస్ఎఫ్ఐ నేత అక్బర్, నాయకులు నరసయ్య, దేవేంద్ర, స్రవంతి, గీత పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న హెచ్ఎం సంధ్యారాణి, అన్నా అనిత, ఎస్ఐ లోకేష్‌కుమార్

తిరుపతి(జీవకోన), జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని హెచ్ఎం సంధ్యారాణి అన్నారు. గురువారం జీవకోన సత్యనారాయణపురంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ నిర్వహించారు. కార్పొరేటర్ అన్నా అనిత అలిపిరి ఎస్ఐ లోకేష్‌కుమార్, టీడీపీ నాయకులు మధుసూదన్ నాయుడు, శ్రీరాములు, శేఖర్‌యాదవ్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

తిరుపతి అర్బన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): గురుపూర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకొని అలిపిరి గరుడావలయం వద్ద హిందూ ధర్మప్రచార భజన కళాకారుల ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. జానపద వృత్తి కళాకారుల సంఘం జాతీయ అధ్యక్షులు యాదగిరి, మాజీ మంత్రి పరసారత్నం, టీడీపీ సీనియర్ నాయకులు ముబ్బు దేవనారాయణరెడ్డి, ఇస్కాన్ టెంపుల్ కార్యదర్శి లీలాప్రభు, కుమార్‌రెడ్డి, పెంచలయ్య, శేఖర్‌రెడ్డి, మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

మంగళం ట్రెండ్స్ పాఠశాలలో ఘనంగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం


హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు

తిరుపతి అర్బన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): నగరశివారు ప్రాంతం మంగళం ట్రెండ్స్ ఉన్నతపాఠశాలలో గురువారం మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం ప్రధానోపాధ్యాయులు కేశవులనాయుడు ఆధ్వర్యంలో పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. తల్లికి వందనం, స్కూల్ కిట్స్ గురించి తెలియజేశారు. చివరగా వ్యాసరచన, వక్తృత్వపోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. చివరగా విద్యార్థులకు మొక్కలు అందజేశారు. దీంతో పాటు ఆ మొక్క పెరుగుదలను నిక్షిప్తపరిచే గ్రీన్‌పాస్‌పోర్ట్ కార్డును అందజేశారు. ముఖ్యఅతిథిగా పంచాయతీ టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సురేష్‌నాయుడు, పేరెంట్స్ చైర్మన్ భాను, సభ్యులు, ఉపాధ్యాయులు సాంబశివరావు, రూపలత, మురళి, వసుంధర, రామచంద్ర, శ్రీధర్, చంద్రశేఖర్, గోపీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి కోసం డబ్బులిచ్చా

● శిల్పారామం సంస్థల చైర్‌పర్సన్‌పై కాంట్రాక్టు ఉద్యోగి ఆరోపణ

తిరుచానూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): పదోన్నతి కోసం రూ.4లక్షలు, అడ్జెస్టమెంట్ కోసం మరో రూ.5లక్షలు తీసుకున్నారంటూ శిల్పారామం సంస్థల చైర్‌పర్సన్ మంజులారెడ్డిపై తిరుపతి శిల్పారామంలో అటెండర్‌గా పనిచేసి ఇటీవల రాజీనామా చేసిన వెంకట్రామయ్య అలియాస్ రమణ ఆరోపించారు. ఈ మేరకు గురువారం మీడియాకు వీడియో విడుదల చేశారు. తిరుపతి పర్యటనకు వచ్చినప్పుడు ప్రొటోకాల్ డ్యూటీలో తాను వెంట వెళ్లినప్పుడు పదోన్నతికి ఖర్చవుతుందని చెప్పారన్నారు. ఆమె కుమారుడు కూడా ఫోనుచేసి పోటీ ఉందని, త్వరగా డబ్బు పంపాలని అడిగారని, వాళ్లిచ్చిన రెండు అకౌంట్లకు తాను డబ్బు పంపానన్నారు. దీనిపై మంజులారెడ్డిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. అమెరికాలోని తన చిన్నాబ్బాయి అవసరాల కోసం తిరుపతిలో తమకు తెలిసిన సందీప్ వద్ద అప్పు అడిగామన్నారు. అతడిచ్చిన నగదును అటెండర్ రమణ (వెంకట్రామయ్య) తీసుకుని బ్యాంకు నుంచి ట్రాన్స్‌ఫర్ చేశాడే తప్ప ప్రమోషన్ కోసమని అతడి వద్ద రూపాయి కూడా తీసుకోలేదన్నారు. మరోసారి అతడు గుంటూరులోని తమ ఇంటికి వస్తే తమ డ్రైవర్‌ను వెంటబెట్టుకుని రూ.5లక్షలు ఇచ్చి అకౌంట్‌లో వేయమని చెప్పామన్నారు. గతంలో ఓ మహిళా ఉద్యోగితో అనుచితంగా ప్రవర్తించిన రమణకు వార్నింగ్ ఇచ్చామని గుర్తుచేశారు. వెంకట్రామయ్య పేరిట మెయిల్ ద్వారా తనకు ఈ ఫిర్యాదు అందిందని శిల్పారామంసీఈవో స్వామినాయుడు ఆంధ్రజ్యోతికి తెలిపారు. అతడు తిరుపతి శిల్పారామం ఏవో వద్ద ఫిర్యాదు చేస్తే విచారిస్తామన్నారు. గతనెలలో శిల్పారామం ఏవోపై దురుసుగా ప్రవర్తించడంతో వెంకట్రామయ్యపై విచారణ వేయడంతో రాజీనామా లెటర్ పెట్టి వెళ్లిపోయారన్నారు.

శెట్టిపల్లిలో ఘనంగా నడివీధి గంగమ్మ జాతర

తిరుపతి అర్బన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని శెట్టిపల్లిలో నడివీధి గంగమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం ఉదయం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, యాదవకార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్ అమ్మవారిని దర్శించుకున్నారు. గత మంగళవారం ప్రారంభమైన జాతర శుక్రవారం ముగియనుంది.

నారాయణలో వేడుకగా మెగా పీటీఎం


విద్యార్థులతో డీజీఎం కొండలరావు, టీచర్లు

తిరుపతి(విద్య), జూలై 10(ఆంధ్రజ్యోతి): స్థానిక న్యూ ఇందిరానగర్‌లోని నారాయణ పాఠశాలలో మెగా పీటీఎం 2.0 కార్యక్రమాలు వేడుకగా సాగాయి. ఈ కార్యక్రమాలకు నారాయణ విద్యాసంస్థల డీజీఎం కొండలరావు ఏజీఎం శ్రీనివాసులుతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థుల తల్లిదండ్రులకు నిర్వహించిన మ్యూజికల్ చైర్స్ పోటీలను ఆయన తిలకించారు. అనంతరం పెద్దలతో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటించారు. తరువాత పిల్లలతో వారి తల్లిదండ్రులకు పాదాభివందనాలు చేయించారు. ఈ కార్యక్రమాల్లో ఆర్ వసంత్‌కుమార్, ప్రిన్సిపాల్ హిమజారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం


శ్రావణి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 10 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ లా విభాగ పరిశోధకురాలు కే.శ్రావణి డాక్టరేట్ పొందారు. మన దేశంలో ప్రజారోగ్యం- చట్టాలు, దృక్పథాలు అంశంపై అంశంపై ప్రొఫెసర్ టి.సీతాకుమారి పర్యవేక్షణలో పరిశోధన పూర్తిచేశారు. శ్రావణి పలు సదస్సుల్లో పాల్గొన్నారు. ఈమె రూపొందించిన పరిశోధనా వ్యాసాలు వివిధ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. ఈ మేరకు వర్సిటీ పీఆర్వో శ్రీరజని తెలిపారు.

బంగారు పాళ్యంలో 'జగన్నాటకం'

● తెలుగు యువత నేత ఆనంద్‌గౌడ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 10 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం పర్యటనలో మాజీ సీఎం జగన్ పగటి నాటకం వేశారని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్‌గౌడ్ విమర్శించారు. మామిడి రైతుల పరామర్శ పేరుతో జగన్ విధ్వంసకర రాజకీయాలకు తెరలేపారని పేర్కొన్నారు. మామిడి రైతు పండించిన పంటను నేల పాలు చేయడం, ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌పై దాడి వంటివి వైసీపీ రాజకీయ విధానానికి అద్దం పడతాయని అభిప్రాయపడ్డారు. జగన్ పర్యటనలో రైతులు లేరని, అందరూ వైసీపీ కార్యకర్తలేనని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో వికృత చేష్టలకు దిగుతున్న వైసీపీ నాయకులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

15న మెగా జాబ్ మేళా

తిరుపతి అర్బన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): స్థానిక చెన్నారెడ్డికాలనీలోని సెట్విన్ కార్యాలయంలో ఈనెల 15న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు సెట్విన్ సీఈవో మోహన్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అపోలోఫార్మసీ లిమిటెడ్, పేటీఎం, జెప్టో కంపెనీలకు సంబంధించి తిరుపతి, హైదరాబాదులలో 300ఉద్యోగాలు ఖాళీలున్నాయి. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఏదైనా డిగ్రీ, ఫార్మసీ, బీఈడీ, డిప్లొమా విద్యార్హతలుండాలి. రూ.18వేల నుంచి రూ.80వేల వరకు జీతం ఉంటుంది. మరిన్ని వివరాలకు 9885284402 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పాకాల మార్కెట్ కమిటీకి పాలకవర్గం

తిరుపతి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పాకాల వ్యవసాయ మార్కెట్ కమిటీకి ప్రభుత్వం నూతన పాలకవర్గాన్ని నియమించింది. గౌరవాధ్యక్షుడిగా ఎమ్మెల్యే పులివర్తి నానీ, చైర్మన్‌గా కె.సుధాకరయ్య, వైస్ చైర్మన్‌గా ఏ.కోదండ నాయుడు, సభ్యులుగా సి.శైలజ, కె.ధనరాజ్, ఐ.కోటేశ్వరరావు, కె.చైతన్య, ఎల్.లోకేశ్వరి, సోమశేఖర్, వి.సతీష్ కుమార్, జి.షాజహాన్, టి.పవిత్ర, వై.సుప్రజ, కె.తిమ్మయ్య, షాజహాన్, వై.సౌజన్య, పాకాల సింగిల్‌విండో చైర్మన్, తిరుపతి వ్యవసాయ శాఖ ఏడీ, ఇర్రంగారిపల్లి పంచాయతీ సర్పంచ్, జిల్లా అగ్రికల్చర్ ట్రేడ్ అండ్ మార్కెటింగ్ ఆఫీసర్ నియమితులయ్యారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), జూలై 10(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం పెద్దకాపులేఅవుట్‌లో ఇద్దరు గంజాయి విక్రేతలను అరెస్టు చేసి 150 గ్రాములు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ అధికారులు గురువారం తెలిపారు. టాస్క్‌ఫోర్సు సీఐ శ్యాంప్రసాద్, ఎస్ఐ స్వామినాథన్ ఈ తనిఖీలు చేశారు. తిరుపతి అర్బన్ ఎక్సైజ్ సీఐ రామచంద్రన్ కేసు నమోదు చేశారు.

ఎస్వీయూ పరిపాలనా భవనంలో పలు విభాగాల ఆధునీకరణ


ఆధునీకరించిన సెక్షన్లను ప్రారంభిస్తున్న వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీ పరిపాలనా భవనంలోని వివిధ కీలక విభాగాల ఆధునీకరణ పనులు పూర్తయ్యాయి. ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగంలో అంతర్గత సెక్షన్లను ఆధునీకరించారు. ఈ సెక్షన్లను వర్సిటీ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు తదితరులు గురువారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ పరిపాలనా విభాగంలోని పలు విభాగాలను దశలవారీగా ఆధునీకరిస్తున్నట్లు చెప్పారు. ఆన్‌లైన్, కంప్యూటర్ సదుపాయం, ఏసీలు తప్పక ఉండేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విభాగాలను ఆధునీకరిస్తామన్నారు. ఉద్యోగులు సౌకర్యవంతంగా విద్యార్థులకు సేవలు అందించడానికి అవకాశం ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇంజినీర్ తాండవకృష్ణ, అసిస్టెంట్ ఇంజినీర్ సంగీతం సుబ్రమణ్యం, టీచింగ్, నాన్‌టీచింగ్ ఏఏలు సురేష్, నరసింహులు, నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్, సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే క్రమశిక్షణతో కూడిన విద్య


సమావేశంలో మాట్లాడుతున్న పసుపులేటి హరిప్రసాద్

తిరుపతి(విద్య), జూలై 10(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో కూడిన విద్య ప్రభుత్వ పాఠశాలల్లోనే లభిస్తుందని హస్త కళల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక ముత్యాలరెడ్డి పల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు హరినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం జరిగిన మెగా పీటీఎం కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం జరిగిన ఆటల పోటీలకు యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్వయంగా థగ్ ఆఫ్ వార్‌లో పాల్గొని ఆటల పోటీలను ప్రారంభించారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో 2025 ఆసియా ప్రపంచ సుందరి భావన రెడ్డి, జనసేన, తెలుగుదేశం పార్టీ నాయకులు బాలసుబ్రమణ్యం, ధరణి కుమారి, మధు, రంగారెడ్డి, చంద్రమౌళి, జానకిరామ్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా శిక్షణ

● తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి


విద్యార్థులతో కరచాలనం చేస్తున్న తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి

తిరుపతి(విద్య), జూలై 10(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు చదరంగం, ఇతర క్రీడల్లో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి చెప్పారు. స్థానిక సర్వేపల్లి రాధాకృష్ణ మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రవిచంద్రన్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన మెగా పీటీఎం కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంత్రి నారా లోకేశ్ ప్రభుత్వ విద్యను పటిష్టం చేసేందుకు విశేషంగా కృషి చేస్తున్నారని తెలియజేశారు. అనంతరం పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఆయన సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో పాఠశాల ఇన్‌చార్జ్ హెడ్‌మాస్టర్ రవికుమార్, చైర్మన్ వాణి, ఇన్‌చార్జి చైర్మన్ రహంతుల్లా, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి



సిగాలగుంట పాఠశాలలో తల్లిదండ్రులకు బహుమతులు అందిస్తున్న దాతలు

తిరుపతి(ఆటోనగర్), జూలై10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా విని క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని తల్లులు పిల్లలను ఆశీర్వదించారు. గురువారం సింగాలగుంటలోని ప్రాథమిక పాఠశాలలో తల్లికి వందనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తల్లులకు పిల్లలు పాదపూజ చేశారు. అనంతరం కార్పొరేటర్ నరేంద్ర విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. అలాగే లిక్విడ్ హ్యాండ్ వాష్‌ను పిల్లలకు వితరణ చేశారు. పలువురు తల్లిదండ్రులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పిఎస్.హేమలత, ఉపాధ్యాయులు సుహాసిని, రిహానా బేగం, లావణ్య పాల్గొన్నారు.

హోం స్టేలలో పోలీసులు తనిఖీలు

తిరుపతి(నేరవిభాగం), జూలై 10(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని హోంస్టేలపై ఈస్ట్ పోలీసులు గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. స్థానిక బాలాజీ హోంస్టేపై ఈస్ట్ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐలు, పోలీసులు కలసి దాడులు చేశారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైలు కింద పడి తెలంగాణవాసి మృతి

తిరుపతి(నేరవిభాగం), జూలై 10(ఆంధ్రజ్యోతి): తిరుపతి సమీపం శెట్టిపల్లి వద్ద గురువారం తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా కొంకల మండలానికి చెందిన వీరేష్ (27) రైలు కిందపడి మృతి చెందారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌రెడ్డి కథనం మేరకు.. కొరమేనుగుంటలోని లోకేష్‌బాబు వద్ద ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న ఈయన స్నేహితులతో కలసి ఆటోనగర్ వద్ద ఉంటున్నారు. ఇంటికి వెళుతున్నట్లు చెప్పి బుధవారం అర్ధరాత్రి బయటకు వచ్చారు. గురువారం ఉదయం శెట్టిపల్లి వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని రుయాకు తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

హెవీ డ్రైవింగ్ స్కూల్లో 34వ బ్యాచ్ శిక్షణ ప్రారంభం


శిక్షణ డ్రైవర్లకు పుస్తకాలు అందజేస్తున్న డీఎం హరిబాబు

తిరుపతి(ఆర్టీసీ), జూలై 10(ఆంధ్రజ్యోతి): అలిపిరి ఆర్టీసీ డిపోలో హెవీ డ్రైవింగ్ స్కూల్లో గురువారం 34వ బ్యాచ్ శిక్షణ ప్రారంభమైంది. అలాగే బుధవారంతో శిక్షణ పూర్తిచేసుకొన్న 33వ బ్యాచ్‌కు సర్టిఫికెట్స్ అందజేసి వీడ్కోలు పలికారు. ముఖ్యఅతిథిగా హాజరైన మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఇప్పటి వరకు 328 మంది శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అలిపిరి డిపో మేనేజర్ హరిబాబు, శిక్షణ కేంద్రం క్లర్క్ రాము, విశ్రాంత సేఫ్టీడ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ ఎం.వి.నాయుడు, కే.నరసింహులు పాల్గొన్నారు.

గురువును పూజించడం భారతీయ సంప్రదాయం

గురు పౌర్ణమి వేడుకల్లో వక్తలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 10 (ఆంధ్రజ్యోతి): గురువును సేవించి విద్య నేర్చుకున్నవారు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుతారని పలువురు ఆధ్యాత్మిక పండితులు పేర్కొన్నారు. ● ఎస్వీ ఓరియెంటల్ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో అవధాని ఆముదాల మురళి మాట్లాడారు. ఆది గురువు వ్యాసుడని తెలిపారు. వ్యాసుడి పుట్టిన రోజును గురు పౌర్ణమిగా భావిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాలేజీ తెలుగు అధ్యాపకులు హేమంత్‌కుమార్, ఈతరం కవితా వేదిక అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు, తిరుపతి జిల్లా రచయితల సంఘం కార్యదర్శి డాక్టర్ మన్నవ గంగాధరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ● శృంగేరీ పీఠంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆధ్యాత్మిక ప్రవచనకర్త ఉప్పలదడియం భరత్‌కుమార్‌శర్మ పాల్గొని మాట్లాడారు. జీవితంలో గురువును మరువరాదన్నారు. చరిత్రలో గొప్ప స్థాయికి చేరిన వారందరూ గురువును ఉన్నత స్థాయిలో గౌరవించిన వారేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో శృంగేరీ పీఠానికి చెందిన రాళ్లపల్లె రామ్మూర్తి, జీఎల్ మనోహర్, పూర్ణచంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్‌శర్మను రాయలసీమ రంగస్థలి అధ్యక్షులు గుండాల గోపీనాథరెడ్డి, తదితరులు శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపికతో సత్కరించారు.


ఎస్వీ ఓరియెంటల్ కళాశాలలో అవధాని ఆముదాల మురళిని సన్మానిస్తున్న దృశ్యం





తిరుమలలో శివమణి

తిరుమల శ్రీవారిని గురువారం ప్రసిద్ధ డ్రమ్స్ వాయిద్య కళాకారుడు శివమణి దర్శించుకున్నారు. ఇంకా సీనియర్ ఐపీఎస్ అధికారి ఐజీ శ్రీకాంత్ కూడా స్వామి దర్శనం చేసుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

'డబ్బుల్' ఆశతో మోసపోయింది

చంద్రగిరి, జూలై 10(ఆంధ్రజ్యోతి): నాకు వచ్చిన క్షుద్ర పూజలు చేశానంటే నగదు 'డబ్బుల్' అవుతుందని నమ్మించాడు. అత్యాశకు పోయిన ఆమె.. రూ.ఏడు లక్షల నగదు, బంగారాన్ని కుదవపెట్టి మరీ అతడికి నగదు ఇచ్చింది. చివరకు మోసపోయినట్లు గుర్తించింది పోలీసులను ఆశ్రయించింది. వివరాలిలా ఉన్నాయి. చంద్రగిరి మండలంలోని ఓ మహిళ.. తన ఇంటికి వచ్చిపోతున్న బంగారుపాలేనికి చెందిన శివప్రసాద్‌ను పక్క పొలంలో వ్యవసాయం చేసే మహిళకు పరిచయం చేసింది. ఆ మహిళకు, పిల్లలకు గండం ఉందని, పూజలు చేయాలని అతడు నమ్మబలికాడు. ఆ ప్రకారం.. ఆమె పూజలు చేయించింది. ఆ పరిచయం మరింత పెరిగింది. ఈ క్రమంలో తనకు క్షుద్ర పూజలు తెలుసని.. డబ్బును రెండింతలు చేసే పూజలు వచ్చని నమ్మబలికాడు. దీంతో ఆమె ఏడాది నుంచి విడతల వారీగా రూ.7 లక్షల నగదు ఇచ్చింది. 30 సవర్ల బంగారు ఆభరణాలు కూడా తాకట్టు పెట్టిచ్చింది. డబ్బు పూజలో పెట్టాలని, రెండింతలు అవ్వటానికి కొంత సమయం పడుతుందని చెప్పుకొచ్చాడు. మూడు నెలలుగా శివప్రసాద్ తనకు సమాధానం చెప్పకుండా దాట వేస్తుండటంతో ఆమెకు అనుమానం వచ్చింది. చివరకు తాను తను మోసపోయినట్లు గ్రహించి గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసును విచారిస్తున్నారు. బంగారుపాలెంకు చెందిన శివప్రసాద్‌పై ఇది వరకే పలు చీటింగ్ కేసులు ఉన్నట్లు సమాచారం.

సర్వదర్శనానికి 14 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.4.39 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 76,501

తలనీలాలు సమర్పించినవారు: 29,033



పులికాట్‌లో అప్పుడే పక్షుల కిలకిలలు









కాలం కాని కాలంలోనూ పులికాట్ సరస్సులో ఈ ఏడాది వలస పక్షుల సందడి కనిపిస్తోంది. సాధారణంగా వేసవిలో పులికాట్ ఎడిపోయి నెర్రెలుబారి ఉంటుంది. అయితే ఈ ఏడాది జనవరి దాకా కూడా వానలు కొనసాగడం, వేసవి ముగియకముందే అడపాదడపా వానలు పడడంతో సరస్సులో అక్కడక్కడా నీటి నిల్వలు చేరాయి. సముద్రపు ఆటుపోట్లకు కూడా సరస్సులోకి నీరు వచ్చి చేరుతోంది. దీంతో చేపా రొయ్యా కదలాడుతున్నాయి. తిండి దొరుకుతుండడంతో స్థానిక రకాల కొంగలతో పాటూ వలస పక్షులు కూడా సరస్సులో కనిపిస్తున్నాయి. ఫ్లెమింగోలు, పెయిటెడ్ స్టార్క్స్, పెలికాన్, నత్తగుల్ల కొంగలు, తెల్లకొంగలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. ఆ కాస్త నీటి చెలమల్లోనే వేటను వెతుక్కుంటున్నాయి. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే మార్గంలో అటూ ఇటూ.. అట్టకానితిప్ప వేనాడు దారి, కొరిడి-పేర్నాడు రోడ్డు, శ్రీహరికోట మొదటి గేటు సమీపంలో బకింగ్ కెనాల్ వద్ద పక్షులు సందడి చేస్తున్నాయి. మత్స్య సంపద దొరుకుతుండడంతో మరోవైపు జాలర్లు కూడా వలలు విసురుతున్నారు. పడవలు తిరుగుతున్నాయి. సాధారణంగా ఈ ప్రాంతానికి నైరుతి వానలు కురవవు. ఈశాన్య రుతుపవనాలతో జల్లులు మొదలై తుఫాన్‌లతో కురిసే వానలతో నదులు పొంగి పారుతాయి. చెరువులు నిండుతాయి. పులికాట్ కళకళలాడుతుంది. విచిత్రంగా ఈ వాతావరణం అప్పుడే పులికాట్‌లో కనిపించడం అరుదైన కనువిందు దృశ్యం.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి,

ఫోటోలు: స్టాఫ్ ఫోటోగ్రాఫర్

దక్షిణామూర్తికి వెండి హారతి సెట్



వెండి హారతి సెట్‌ను అందజేస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ బొప్పన ఝాన్సీ తదితరులు

శ్రీకాళహస్తి, జూలై 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మేధో గురుదక్షిణామూర్తికి గురుపౌర్ణమిని పురస్కరించుకుని శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ బొప్పన ఝాన్సీ, డైరెక్టర్ సీమ రూ.4.10లక్షల విలువైన వెండి హారతి సెట్‌ను వితరణ చేశారు. వాటిని ఆలయ ఈవో బాపిరెడ్డి స్వీకరించి దాతలకు స్వామిఅమ్మవార్ల దర్శనం ఏర్పాట్లు చేశారు. వారు గురుదక్షిణామూర్తి వద్ద జరుగుతున్న పూజల్లో పాల్గొన్నారు.

మాన్యుఫ్యాక్చరింగ్ వరల్డ్‌లో శ్రీసిటీ ప్రాతినిధ్యం



సందర్శకులకు శ్రీసిటీ గురించి వివరిస్తున్న ప్రతినిధులు

శ్రీసిటీ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తయారీ రంగానికి ప్రాధాన్యం కలిగిన ప్రపంచ గమ్య స్థానంగా శ్రీసిటీ గురించి వివరాణ్మతకంగా తయారు చేసిన మార్కెటింగ్ వీడియోలను శ్రీసిటీ మార్కెటింగ్ బృందం టోక్యోలో జరిగిన కార్యక్రమంలో ప్రదర్శించింది. జపాన్‌లోని టోక్యో నగరంలో జరిగిన 'మాన్యుఫ్యాక్చరింగ్ వరల్డ్ 2025' వాణిజ్య ప్రదర్శనలో శ్రీసిటీ పాల్గొని ప్రత్యేకతను చాటుకుంది. ఆర్ఎక్స్ జపాన్ లిమిటెడ్ నిర్వహించిన 37వ ఎడిషన్ ఎగ్జిబిషన్‌లో ఐటీ సొల్యూషన్స్, మెకానికల్ కాంపోనెంట్స్, మెడికల్ డివైసెస్, సైబర్ సెక్యూరిటీ, స్మార్ట్ మెయింటెన్స్ తదితర పది విభాగాలకు సంబంధించి ప్రదర్శన ఏర్పాటు చేశారు. భారతదేశంలో రెండవ అతి పెద్ద జపనీస్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌గా వివరిస్తూ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శ్రీసిటీ స్టాల్ అందరి దృష్టిని ఆకర్షించింది. శ్రీసిటీ వ్యూహాత్మక స్థానం, ప్రపంచస్థాయి మౌలిక వసతులు, రవాణా అనుసంధానం, పరిశ్రమలు స్థాపించడం కలిగే వివిధ ప్రయోజనాలను శ్రీసిటీ మార్కెటింగ్ ప్రతినిధులు గోపికృష్ణ, కె.బాలాజీ, శ్రీసిటీ సలహాదారు మసనోరి నకానో సందర్శకులకు వివరించారు.

నైపుణ్య శిక్షణతో జీవనోపాధి కల్పన

- కాలేజియేట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ భరత్‌కుమార్‌గుప్తా



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 10 (ఆంధ్రజ్యోతి): మహిళలకు నైపుణ్య శిక్షణ అందించడం ద్వారా జీవనోపాధి కల్పించే లక్ష్యం ఉందని రాష్ట్ర కాలేజియేట్ ఎడ్యుకేషన్ శాఖ డైరెక్టర్ భరత్‌కుమార్‌గుప్తా పేర్కొన్నారు. తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీలో గురువారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. యూనివర్సిటీలకు అందిస్తున్న నిధులను సరైన రీతిలో సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. మహిళలకు మంచి నైపుణ్య శిక్షణ అందివ్వడం ద్వారా ఉన్నత ఉపాధి కల్పన, తద్వారా మహిళా సాధికారతను సాధించడం వంటి లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించుకుందన్నారు. ఈ లక్ష్యాలను క్షేత్రస్థాయిలో పటిష్ఠంగా అమలయ్యేలా అధికారులు కృషి చేయాలని కోరారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ రామ్మోహనరావు మాట్లాడుతూ.. ప్రస్తుతం లభిస్తున్న ఉపాధి అవకాశాలకు అనుగుణంగా విద్యార్థులకు అవగాహన కల్పించేలా యూనివర్సిటీలు ప్రయత్నించాలన్నారు. పద్మావతి యూనివర్సిటీ వీసీ ఉమ మాట్లాడుతూ.. పీఎం-ఉష పథకం ద్వారా యూనివర్సిటీకి మంజూరైన రూ. 100 కోట్లను పటిష్ట ప్రగతికి వినియోగిస్తున్నట్టు చెప్పారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.రజని, కేరళకు చెందిన ఐఏఎస్ అధికారి డాక్టర్ ఉష తదితరులు విద్య, నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పన అంశాల్లో తమ అనుభవాలను పంచుకున్నారు.



తిరుపతిలో ర్యాలీ నిర్వహిస్తున్న జర్నలిస్టులు

గళం విప్పిన కలం

- దాడులను ఖండిస్తూ రోడెక్కిన జర్నలిస్టులు
- క్రికెట్ కిట్టు ధరించి నిరసన
- మద్దతుగా నిలిచిన ప్రజా సంఘాలు, ప్రజా ప్రతినిధులు

తిరుపతి(వైద్యం), జూలై 10 (ఆంధ్రజ్యోతి): 'ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేస్తున్న జర్నలిస్టులపై దాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలి. జర్నలిస్టుల స్వేచ్ఛకు రక్షణ కల్పించాలి' అంటూ జర్నలిస్టు సంఘాల నేతలు, జర్నలిస్టులు డిమాండు చేశారు. బంగారుపాళ్యంలో బుధవారం ఆంధ్రజ్యోతి చిత్తూరు స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై వైసీపీ శ్రేణులు దాడికి పాల్పడటాన్ని ఖండించారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్ నుంచి నాలుగు కాళ్ల మండపం వరకు జర్నలిస్టులు నిరసన ర్యాలీ నిర్వహించారు. వీరికి ప్రజా సంఘాల నేతలు, ప్రజాప్రతినిధులు మద్దతుగా నిలిచారు. 'జర్నలిస్టులపై దాడులకు పాల్పడటమే లక్ష్యంగా వైసీపీ మూకలు తెగబడుతున్నాయి. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అనంతపురంలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై ఇదే రీతిలో దాడికి పాల్పడ్డారు. అదే తరహాలో ఇప్పుడు ప్రతిపక్షంలోనూ ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై మూకుమ్మడిగా దాడికి దిగారు. ఇది సమాజానికి ఎంతమాత్రం శ్రేయస్కరం కాదు. శివకుమార్‌పై దాడికి పాల్పడిన వైసీపీ రౌడీ మూకలను శిక్షించి జర్నలిస్టులకు న్యాయం చేయాలి. శివకుమార్‌పై పది మందికిపైగా దాడికి పాల్పడుతున్న వీడియోలు, ఫొటోలు స్పష్టంగా ఉన్నప్పటికీ పోలీసులు గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసినట్లు కేసు నమోదు చేయడం, ప్రధాన నిందితులను వదిలేసి ఒకరిద్దరిపై కేసులు నమోదు చేస్తుండటం చూస్తుంటే పోలీసు వ్యవస్థపైనా నమ్మకం కోల్పోయే పరిస్థితి వచ్చే అవకాశం ఉంది. పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి దాడులకు పాల్పడిన వైసీపీ మూకలపై చర్యలు చేపట్టకుంటే రాష్ట్రస్థాయిలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం' అని హెచ్చరించారు. వైసీపీ మూకల దాడులకు భయపడి జర్నలిస్టులు రక్షణ కవచాలు వేసుకొని విధులకు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయంటూ క్రికెట్ రక్షణ కిట్ ధరించి నిరసన తెలిపారు. అనంతరం ధర్నా చేస్తున్న జర్నలిస్టులకు కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ మద్దతుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్ఎం ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గిరిబాబు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి పాలవల్లి నరేంద్ర, డీవైఎఫ్ఐ నేత జయచంద్ర, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మురళి, జర్నలిస్టు నేతలు సురేంద్రరెడ్డి, కోలా లక్ష్మీపతి, డీవైఎఫ్ఐ నేత జయచంద్ర, పలు జర్నలిస్టు సంఘాల నేతలు, ప్రజా సంఘ నాయకులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జగన్ బాధ్యత వహించాలి

జర్నలిస్టులపై దాడులకు పాల్పడటం అమానుషమైన ఘటన. ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టు శివకుమార్‌పై దాడికి పాల్పడిన వైసీపీ నేతలను, బాధ్యులను శిక్షించాలి. దీనికి మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యత వహించాలి. మళ్లీ వైసీపీ నేతలు ఇలాంటి ఘటనలకు గట్టి చర్యలు చేపట్టాలి.

- చింతా మోహన్, కేంద్ర మాజీ మంత్రి

జర్నలిస్టులపై దాడులు కొనసాగుతుండటం దౌర్భాగ్యం

జర్నలిస్టులపై దాడులకు పాల్పడే పరిస్థితులు కొనసాగుతుండటం నిజంగా దౌర్భాగ్యం. దీనిని అరికట్టాలంటే జర్నలిస్టులు ఐకమత్యంగా ఉండాలి. అధికారంలో ఉన్నా, లేకున్నా జర్నలిస్టులపై వైసీపీ నేతలు దాడులకు పాల్పడుతుండటం మానుకోవడం లేదు. జర్నలిస్టుల రక్షణకున్న చట్టాలను పక్కాగా అమలు చేయకపోవడం వల్లే ఈ దుస్థితి.

- ఆర్ఎం ఉమామహేశ్వరరావు, ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్

జర్నలిస్టులపై దాడులు సమాజానికి మంచిది కాదు

జర్నలిస్టులపై దాడులకు పాల్పడటం సమాజానికి ఎంతమాత్రం మంచిది కాదు. వైసీపీ నేతలు రౌడీల్లా వ్యవహరిస్తూ జర్నలిస్టులపై దాడులకు పాల్పడటం తీవ్రంగా ఖండిస్తున్నాం. నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలి.

- జయచంద్ర, డీవైఎఫ్ఐ నేత

దాడులకు పాల్పడిన వారిని శిక్షించాలి

ఫొటో జర్నలిస్టు శివకుమార్‌పై దాడికి పాల్పడిన వైసీపీ రౌడీ మూకలను కఠినంగా శిక్షించాలి. ఈ దాడులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా కారకులైన వారిపైనా చర్యలు తీసుకోవాలి. జర్నలిస్టుల స్వేచ్ఛను హరించేలా దాడులకు పాల్పడటాన్ని ఖండిస్తున్నాం.

- నరేంద్ర, ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి

24 గంటల్లోపు చర్యలు తీసుకోవాలి

ఫొటో జర్నలిస్టుపై వైసీపీ నేతల మూకుమ్మడి దాడి దారుణం. దాడులకు పాల్పడిన వారితోపాటు.. ప్రేరేపించిన వారిపైనా 24 గంటల్లోపు చర్యలు తీసుకోవాలి. జర్నలిస్టుల రక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి.

- మురళి, తిరుపతి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు

మాజీ డిప్యూటీ సీఎంపైనా చర్యలు తీసుకోవాలి

శివకుమార్‌పై దాడికి పాల్పడిన వారితోపాటు.. దాడికి ప్రేరేపించిన మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి మీద కూడా చర్యలు తీసుకోవాలి. వైసీపీ నేతలు వారి చేతగానితనాన్ని నిస్సహాయ స్థితిలో ఉన్న ఒక ఫొటో జర్నలిస్టుపై చూపారు.

- గిరిబాబు, రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు

వైసీపీ రౌడీలను అరెస్టు చేయండి: టీడీపీ



తిరుపతి, జూలై10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై దాడిచేసిన వైసీపీ రౌడీలను వెంటనే అరెస్టు చేయాలని తిరుపతి డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ డిమాండు చేశారు. ఈ దాడిని ఖండిస్తూ గురువారం తిరుపతి భవాని నగర్‌లోని టీడీపీ క్లస్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టులపై దాడిచేయడం వైసీపీ అల్లరిమూకలకు అలవాటుగా మారిపోయిందని మండిపడ్డారు. అధికారంలో లేకపోయినా వారి దౌర్జన్యాలకు అదుపేలేకుండా పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్ర కోటి సదాశివం, కూటమి నాయకులు మహేష్ యాదవ్, ఎస్వీఎం శ్రీధర్, సుబ్బుయాదవ్, వినోద్ రాయల్ జగన్నాథం, సుధాకర్ రెడ్డి, రవితేజ నాయుడు, రూపేష్, శరత్, దేవాచారి, చంద్ర రెడ్డి, సురేష్, శంకర్ యాదవ్,అబ్దుల్లా, ముని, రమేష్, గౌష్ భాషా, సమీర్,, ముని, చంద్ర ఆచారి, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

'స్కిట్'కు పూర్వవైభవం: సుధీర్



స్కిట్‌లో భవనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, జూలై 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (స్కిట్)లో ఈ ఏడాది తరగతులు ప్రారంభించనుండటంతో పూర్వవైభవం రానుందని ఎమ్మెల్యే సుధీర్ చెప్పారు. శ్రీకాళహస్తిలోని స్కిట్‌లోని తరగతి గదులు, ల్యాబ్‌లు, భవనం తదితరాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. తన తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి స్కిట్ ఏర్పాటు చేయించి స్థానిక విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందించారన్నారు. వైసీపీ పాలకులు దీనిని మూసేసి యువతకు ద్రోహం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో తాను ఇచ్చిన హామీ ప్రకారం తిరిగి ప్రారంభించడానికి ఏడాదిగా ప్రయత్నించానన్నారు. తన బాల్యమిత్రుడు, మంత్రి లోకేశ్ స్కిట్ కళాశాలను జేఎన్‌టీయూకు అనుసంధానం చేసి.. ముక్కంటి ఆలయానికి పైసా ఖర్చు లేకుండా ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభమయ్యేలా చేసిన కృషి మరువలేమన్నారు. ప్రభుత్వం నుంచి స్కిట్ అభివృద్ధికి త్వరలో రూ.120 కోట్లు మంజూరవుతాయన్నారు. మరోమూడు రోజుల్లోనే ఆరు బ్రాంచుల్లో 300మంది విద్యార్థులు మొదటి సంవత్సరంలో చేరేలా కసరత్తు ప్రారంభమైందన్నారు. దీని కోసం ఆరు తరగతి గదులు, ల్యాబ్, ప్రిన్సిపాల్ చాంబర్, ఇతర గదులను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో స్పేస్ టెక్నాలజీ.. మెడికల్ కళాశాలలను నెలకొల్పేలా ప్రభుత్వంలోని పెద్దలతో చర్చిస్తున్నానని చెప్పారు.

జీఎన్ఎస్ఎస్ ఈఈ హరిబాబుపై సస్పెన్షన్ ఎత్తివేత

- శ్రీకాళహస్తి డిప్యూటీ ఎస్ఈగా నియామకం

తిరుపతి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతి గాలేరు-నగరి డివిజన్ ఈఈ సీహెచ్ హరిబాబుపై సస్పెన్షన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఎత్తివేసింది. ఆయన్ను శ్రీకాళహస్తి జీఎన్ఎస్ఎస్ డిప్యూటీ ఎస్ఈగా నియమించింది. ఈయన తిరుపతి జీఎన్ఎస్ఎస్ డివిజన్‌కు ఎఫ్ఏసీ ఈఈగా పనిచేసిన సమయంలో హైదరాబాదుకు చెందిన ఓ కాంట్రాక్టు సంస్థకు నిబంధనలకు విరుద్ధంగా రూ.1.36 కోట్లు బ్యాంకు గ్యారెంటీలను రిలీజ్ చేశారన్న ఆరోపణలు ఎదుర్కొన్నారు. దానిపై ప్రభుత్వం గతేడాది డిసెంబరు 23న సస్పెండ్ చేసింది. శాఖాపరమైన విచారణకు ఆదేశించిన నేపథ్యంలో, సస్పెండు చేసి ఆరు నెలలు దాటినందున తనకు పోస్టింగ్ ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తూ గతనెల 4న లేఖ రాశారు. ఈ క్రమంలో సస్పెన్షన్ ఎత్తివేస్తూ గతనెల 30న ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం.. తాజాగా శ్రీకాళహస్తి డివిజన్‌కు డిప్యూటీ ఎస్ఈగా నియమించింది.

పుత్తూరు వార్తలు

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

పుత్తూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య, వసతుల కల్పనలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చెప్పారు. కొత్తగా మోడల్ ప్రైమరీ పాఠశాలగా ప్రారంభమైన ప్రధాన పాఠశాల మెయిన్‌లో గురువారం మెగా పీటీఎం డే ఘనంగా జరిగింది. మధ్యాహ్న భోజనం, విద్యా సామగ్రి పంపిణీ, విద్యాదీవెన అందరికీ సంతృప్తి నిచ్చిందా అని తల్లిదండ్రులను ఎమ్మెల్యే ప్రశ్నించారు. తన తండ్రి ముద్దుకృష్ణమ హయాం నుంచి ఈ పాఠశాల అంచెలంచెలుగా ఎదిగిన తీరును తల్లిదండ్రులు తనతో చెప్పడం ఆనందంగా ఉందన్నారు. టీడీపీ నాయకులు గంజి మాధవయ్య, గాలి జీవరత్నంనాయుడు, డిఎస్ గణేష్, జనసేన నాయకుడు మహేష్, విద్యాశాఖాధికారులు మహేశ్వరరావు, తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం, అటవీశాఖాధికారి మాధవి తదితరులు పాల్గొన్నారు.

గురుపౌర్ణమి వేడుకలు



పుత్తూరు అర్బన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురుపౌర్ణమి వేడుకలు ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. గురువారం సాయిబాబా ఆలయాలు కిటకిటలాడాయి. టీబీ రోడ్డులోని సాయిబాబా ఆలయంలో భక్తులు స్వయంగా బాబాకు పాలాభిషేకం చేశారు. కల్యాణపురం పరిధిలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో వేకువ జామున కాగడ హారతితో పూజలు ప్రారంభమయ్యాయి. శివాలయం, సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు కిటకిటలాడాయి.

పాఠశాల క్రీడా మైదానం ధ్వంసం

పుత్తూరు అర్బన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని తడుకు పంచాయతీ తిమ్మరాజుకండ్రిగ ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానాన్ని ధ్వంసం చేశారని గ్రామస్తులు ఎంఈవోకు ఫిర్యాదు చేశారు. దాదాపు ఎనిమిది దశాబ్దాలుగా పాఠశాల సజావుగా సాగుతోందన్నారు. గడిచిన 25 సంవత్సరాలుగా క్రీడా మైదానం, పక్కనే దాతలు ఇచ్చిన స్థలంలో మొక్కలతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దామన్నారు. గురువారం అన్నపూర్ణ, ఆమె భర్త సుదర్శనం తదితరులు మైదానంతో పాటు పరిసరాలను ధ్వంసం చేశారన్నారు.

ఇష్టపడి చదవండి


వడమాలపేటలో విద్యార్థులకు మొక్కలు అందజేస్తున్న ఎమ్మెల్యే

వడమాలపేట, జూలై 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చెప్పారు. గురువారం వడమాలపేట బాలుర ఉన్నత పాఠశాలలో మెగా పీటీఎంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులను తల్లితండ్రులు ప్రోత్సాహించి చదివించాలని చెప్పారు. జట్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి, నాయకులు ధనంజయులు నాయుడు, దాముయాదవ్, శివరాయల్, లక్ష్మీప్రసన్న, ఎంపీడీవో శేషగిరిరావు, ఏంఈవో పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించండి

సత్యవేడు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రికి వచ్చే పేదలకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే ఆదిమూలం డాక్టర్లను కోరారు. గురువారం సత్యవేడు ప్రభుత్వ ఆస్పత్రిలో మెడికల్ సూపరిండెంట్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశానికి ఎమ్మెల్యే ఆదిమూలం చైర్మన్ హోదాలో హాజరయ్యారు. ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న వైద్య పరికరాలను సద్వినియోగం చేసుకుని రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో అభివృద్ధి నిధులు ఒక్క పైసా కూడా లేదని తెలుసుకున్న ఎమ్మెల్యే విస్మయం వ్యక్తం చేశారు. ఈ విషయమై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో ఫోన్లో మాట్లాడారు. ఆస్పత్రి కమిటీ సభ్యులు హేమభూషణం, ధనేష్, డాక్టర్లు చంద్రన్, రిహాన్ నాయకులు సుబ్రహణ్యంరాజు, వెంకటరమణ, ధనశేఖర్, బాలమురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాల భవితకు భరోసా

సత్యవేడు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): బంగారు కుటుంబాల భవితకు భరోసానిచ్చేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర విజన్ - 2047 యాక్షన్ ప్లాన్‌ను పక్కాగా రూపొందించాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ అధికారులను కోరారు. సత్యవేడు ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీడీవో త్రివిక్రమరావు ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర విజన్‌పై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఏడు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ఇంటర్ మహిళా హాస్టల్ ఆకస్మిక తనిఖీ


మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్

శ్రీకాళహస్తి, జూలై 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తెలుగుగంగ కాలనీలో ఉన్న మహిళా జూనియర్ హాస్టల్‌ను శ్రీకాళహస్తి 12వ జిల్లా అదనపు న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లోని పరిస్థితులను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపిస్తా

శ్రీకాళహస్తి, జూలై 10(ఆంధ్రజ్యోతి): గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపిస్తానని ఎమ్మెల్యే సుధీర్ అన్నారు. తొట్టంబేడు మండలం కారాకొల్లు, కంచనపల్లిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. అనంతరం ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ నాయకులు మునిరాజానాయుడు, గాలి చలపతినాయుడు, మురళినాయుడు, రామానాయుడు, మోహన్, జయచంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

'పాఠశాలను కాపాడుకున్నాం'



తిరుపతి (ఆటో నగర్), జూలై 10: రేణిగుంట మండలం ఎస్ఆర్ పట్టెడలో ప్రభుత్వం రద్దు చేసిన ప్రాథమికోన్నత పాఠశాలను ఎమ్మెల్యే సుధీర్ సహకారంతో తిరిగి మంజూరు చేసుకున్నామని, తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలకు పంపాలని టీడీపీ సీనియర్ నాయకుడు ఆర్.దేవేంద్రనాథ్ రెడ్డి కోరారు. గురువారం పాఠశాలలో విద్యార్థులకు ఆయన విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఎంఈవో ఇందిరాదేవి మాట్లాడుతూ ప్రభుత్వం పేదల కోసం ఉచిత విద్యను అందిస్తోందన్నారు. తూకివాకం ఈవో రమేష్ చంద్రబాబు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తల్లి, దండ్రులు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

మాజీ సీఎం జగన్ జైలుకెళ్లడం ఖాయం: కురుగొండ్ల

వెంకటగిరి, జులై 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్ జైలుకు వెళ్లడం ఖాయమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జగన్‌పై ఉన్నన్ని కేసులు దేశంలోనే ఏ రాజకీయ నాయకుడి పైనా లేవన్నారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమారెడ్డి చేసిన వ్యాఖ్యలు సభ్యసమాజం సిగ్గుతో తలదించుకొనే విధంగా ఉన్నాయన్నారు. ఆయనతో పాటు పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరాందాస్ గంగాధర్, ఎంపీపీ తనూజారెడ్డి, టీడీపీ నాయకులు రాజేశ్వరరావు, చంద్రమౌళిరెడ్డి, సత్యనారాయణ, మురళి ఉన్నారు.

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం: పాశిం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని పలు పాఠశాలల్లో నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో వసతులు ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు, తమ పిల్లలు ఎలా చదువుతున్నారో అవగాహన పెంచు కునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించిందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యార్థులకు మెరుగైన వసతులతో బోధన అందించేందుకు విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చారన్నారు. విద్యార్థులకు నాణ్యత కలిగిన విద్యాసామగ్రి, యూనిఫాం, బూట్లు అందించడంతోపాటు నాణ్యమైన పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజన పథకాన్ని అందిస్తున్నారన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంతో పాటు దేశం గర్వించదగ్గ స్థాయికి ఎదిగేలా బాటలు వేస్తున్నారన్నారు. అనంతరం పలు పాఠశాలలో ప్రతిభచాటిన విద్యార్థులను అభినందించారు. మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో సనత్‌కుమార్ ఎంఈవో రవీంద్రబాబు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల బంగారు భవిష్యత్తు కోసం బడివైపు ఒక అడుగు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

సూళ్లూరుపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పిల్లల బంగారు భవిష్యత్ కోసం బడివైపు తల్లిదండ్రులు ఒక అడుగు పేరుతో ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్ టీచర్స్ సమావేశానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. గురువారం పట్టణంలోని స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన తల్లిదండ్రులు - ఉపాధ్యాయుల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ పిల్లలు చదువుతున్న పాఠశాలలో వసతులు గురించి తల్లిదండ్రులు తెలుసుకునేందుకు ఈ సమావేశం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తల్లిదండ్రుల సలహాలు కూడా ఎంతో అవసరమన్నారు. కూటమి ప్రభుత్వం విద్యా రంగానికి పెద్దపీట వేసిందని విద్యార్థులు క్రమ శిక్షణతో కూడిన విద్యను నేర్చుకొంటే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునన్నారు. అదే విధంగా బాలుర ఉన్నత పాఠశాల, మండలంలోని అన్ని పాఠశాలలో ఈ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నాయకులు శివప్రసాద్, తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఏజీ కిషోర్, చిట్టేటి పెరుమాల్, అలవల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభ్యాసంలో తల్లిదండ్రుల భాగస్వామ్యం ఉండాలి


విద్యార్థులతో భోజనం చేస్తున్న ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దారు రాజేంద్ర, ఎంఈవో మునిరత్నం తదితరులు

నాయుడుపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల విద్యాభ్యాసంలో తల్లిదండ్రు భాగస్వామ్యం ఉండాలని సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి అన్నారు. నాయుడుపేట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన తల్లిదండ్రులు - ఉపాధ్యాయులు సమావేశంలో ఆమె మాట్లాడారు. బడిఈడు పిల్లలందరూ బడిలో ఉండాలని, అందుకోసం విద్యాశాఖ సంపూర్ణంగా కృషి చేస్తోందన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి ఉండగా, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత విద్య, పుస్తకాలు, భోజనం, యూనిఫాం తదితర విద్యాసామగ్రిని ఉచితంగా అందజేస్తుందన్నారు. అంతేకాకుండా క్వాలిఫైడ్ ఉపాధ్యాయులతో బోధన ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో మునిరత్నం, తహసీల్దారు రాజేంద్ర, హెచ్ఎం మనోజ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఎదుగుదలలో తల్లిదండ్రులది కీలక బాధ్యత

దక్కిలి, జులై 10 (ఆంధ్రజ్యోతి) విద్యార్థుల ఎదుగుదలలో తల్లిదండ్రులు కీలక బాధ్యత తీసుకోవాలని దక్కిలి గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ మాధవీలత పేర్కొన్నారు. గారువారం గురుకుల కళాశాలలో తల్లిదండ్రులు, అధ్యాపకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సాంస్కృతిక, ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్నరాణి, ఎంఈవో జగదీష్ బాబు, ఏఎస్‌వో వెంకటయ్య, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్లు దండవోలు, వెంకటరమణారెడ్డి, సర్వేపల్లి రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు - ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించినట్లు ఎంఈవో మించల శంకరయ్య తెలిపారు.

వాకాడు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు - ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించారు. వాకాడు ఎస్ఏఎల్‌సీ ఈఎఫ్ పాఠశాల విద్యార్థులకు టీడీపీ నాయకుడు సన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి రూ.50వేలతో కుర్చీలు, ట్రంకుపెట్టెలు, విద్యాసామాగ్రి అందజేశారు. పూడిరాయదొరువు పాఠశాలలో 60మంది విద్యార్థులకు జామెట్రీ బాక్సులు, హాట్‌బాక్సులను యర్రబోతు రాజగోపాల్‌రెడ్డి అందజేశారు. నిడిగుర్తి పాఠశాలలో తీపలపూడి రమణయ్య రూ.5వేలతో విద్యాసామగ్రి అందజేశారు. బుసపాళెంలోని పాఠశాలలో ఇంగిలీల బుజగేంద్ర విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేశారు. తిరుమూరులో కుంచం దయాకర్, ముట్టెంబాకలో అనిల్‌కుమార్‌రెడ్డి, గంగన్నపాళెంలో అయోధ్య బాలచంద్రయ్యశెట్టి, దుగరాజపట్నంలో దోశకాయల కృష్ణమూర్తి, వాలమేడులో శ్రీహరియాదవ్ విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

ఓజిలి: మండలంలో మెగా పేరెంట్ - టీచర్స్ సమావేశాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఓజిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈసమావేశంలో ఎంఈవో శైలజ, టీడీపీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పాడి వెంకటసుబ్బయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి కంకణాల సత్యవరప్రసాద్ రావు పాల్గొన్నారు. ఈసందర్భంగా పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్‌ను సన్మానించారు. సమావేశంలో ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కోట: మండల పరిధిలోని గురుకులాలు, ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో తల్లిదండ్రులు - ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించారు. కోటలోని పూలే బీసీ బాలుర గురుకులంలో ప్రిన్సిపాల్ నారాయణరావు ఆధ్వర్యంలో విద్యార్థులు తల్లులకు పాదపూజ చేసి ఆశీర్వాదం పొందారు. అంబేద్కర్ గురుకులంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

చిట్టమూరు: మండలంలోని చిట్టమూరు, మల్లాం, అరవపాళెం, మొలకలపూడి, యాకసిరి, గునపాడు, మెట్టు, ఈశ్వరవాక, ఆరూరు ఉన్నత పాఠశాలల్లో తల్లిదండ్రులు - ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఎంఈవో కృష్ణయ్య, పాఠశాల యాజమాన్య కమిటీల చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని ఎల్ఏసాగరంలో ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు - ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఎంఈవో మునిరత్నం, ప్రధానోపాధ్యాయురాలు మీనా కుమారి, సూళ్లూరుపేట ఏఎస్‌డబ్ల్యూవో లక్ష్మీరాజ్యం, టీడీపీ నాయకుడు పెనల కిషోర్‌బాబు, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, రామమోహన్, జీవీ నాయుడు, గురవయ్య, బాలసుబ్రహ్మణ్యం, ఆనంద్, సుబ్రహ్మణ్యం, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

తడ: మండలంలోని అన్ని పాఠశాలల్లో తల్లిదండ్రులు - ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించారు. అండగుండాల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో మల్లికార్జునరావు పాల్గొన్నారు. చిన్నమాంబట్టు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులను గ్రామస్తులు సత్కరించారు.

నిరంకుశ పాలన నుంచి అభివృద్ధి వైపు తొలి అడుగు: విజయశ్రీ

ఓజిలి, జూలై 10(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం నిరంకుశ పాలనను పాతిపెట్టి సుపరిపాలనతో అభివృద్ధివైపు తొలి అడుగు వేసిందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. ఓజిలి మండలం కరబల్లవోలు, సగుటూరు గ్రామాల్లో గురువారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను, చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమాన్ని వివరిస్తూ ఇంటింటా కరపత్రాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దారు పద్మావతి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రవివర్మ, ఏపీఎం పద్మ, ఓజిలి, పెళ్లకూరు టీడీపీ కన్వీనర్లు గుజ్జలపూడి విజయకుమార్‌నాయుడు, సంచి కృష్ణయ్య, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, ప్రధాన కార్యదర్శి దాసరి నిరంజన్, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పాడి వెంకటసుబ్బయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి కంకణాల సత్యవరప్రసాద్‌రావు, నాయకులు బచ్చల రవీంద్రారెడ్డి, మస్తాన్‌రెడ్డి, సుబ్బారావు, భాస్కర్‌రెడ్డి, దారా అంకయ్య పాల్గొన్నారు.

బాలాయపల్లి డీటీగా సందీప్

బాలాయపల్లి, జూలై10(ఆంధ్రజ్యోతి): బాలాయపల్లి డిప్యూటీ తహసీల్దారుగా సందీప్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న డీటీ శిరీష దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు.

వాకాడు డీటీగా రఫీ సయ్యద్

వాకాడు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వాకాడు డిప్యూటీ తహసీల్దారుగా రఫీ సయ్యద్ గురువారం బాధ్యతలు చేపట్టారు. గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయన బదిలీపై వాకాడుకు వచ్చారు. రఫీ సయ్యద్‌ను రెవెన్యూ సిబ్బంది సత్కరించారు.

ఓజిలి ఎస్‌గా శ్రీకాంత్

ఓజిలి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండల ఎస్ఐగా కె.శ్రీకాంత్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన స్వప్న బదిలీపై శ్రీహరికోటకు వెళ్లగా అక్కడ ఉన్న శ్రీకాంత్ ఓజిలికి వచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

సంక్షేమ పథకాలను వర్తింపజేయాలి

గూడూరు అర్బన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లో పనిచేసే పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులందరికీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని సీఐటీయూ నాయకులు అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, వెంకటరమణయ్య, శివకుమార్, బీవీ రమణయ్య, మణి, శంకరయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గురుపౌర్ణమి వేడుకలు

గూడూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలోని సాయిబాబా గుడి, నరసింగరావుపేటలోని సాయిబాబా ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. అదేవిధంగా స్థానిక సాయిసత్సంగ నిలయంలో నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో సాయి బాబాకు ప్రత్యేక పూజలు జరిపారు.

తడ: స్థానిక బోడిలింగాలపాడు వద్ద ఉన్న సాయిబాబా మంది రంలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. సాయిబాబాకు పాలతో అభిషేకం చేశారు. అనంతరం కలశపూజ జరిగింది. ఉభయదాతలుగా నిప్పో పరిశ్రమ ఎండీ ద్వారకనాథ్‌రెడ్డి వ్యవహరించగా, అన్నదాన కార్యక్రమాలను నిప్పో పరిశ్రమ హెడ్ నాగరాజు, రమేష్, శివారెడ్డి, ఏడుమలై తదితరులు పర్యవేక్షించారు. చినమాంబట్టులో ఉన్న కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణాదేవి ఆలయంలో గోపూజ జరిగింది. నాగేశ్వరరావు, బాలసరస్వతి దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని పలు ఆలయాల్లో గురుపూర్ణిమ వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. పాత బస్టాండ్ వద్ద ఉన్న సాయిబాబ, కుమ్మరిగుంట వద్ద సాయిబాబా ఆశ్రమం, కలివేలమ్మ ఆలయం వద్ద ఆలయాల్లో అన్నదానం చేశారు.

చిట్టమూరు: మండలంలోని చిట్టమూరు, మల్లాం, గునపాటిపాళెం సాయిబాబా మందిరాల్లో ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు.

కోట: మండల పరిధిలోని విద్యానగర్, కోట, తిమ్మానాయుడుపాళెం గ్రామాల్లో ఉన్న సాయిబాబా ఆలయాల్లో గురువారం గురుపూర్ణిమ వేడుకలు జరిగాయి. బాబా ప్రతిమలతో గ్రామోత్సవం నిర్వహించారు. కోటలోని ఆలయంలోని బాబా విగ్రహానికి ప్రముఖ సంగీత దర్శకుడు సాలూరు కోటి కుమారుడు రోషన్ దాతృత్వంతో రూ2 లక్షల విలువ చేసే వెండికి బంగారు తాపడం చేసిన సింహాసనాన్ని అందజేశారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని అగ్రహారపేట, బ్రాహ్మణ వీధుల్లో ఉన్న సాయిబాబా ఆలయాల్లో గురువారం గురుపూర్ణిమ వేడుకలు వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచి పాలాభిషేకాలు చేశారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని కేఆర్‌పాలెం, సాయినగర్ ఉన్న సాయిబాబ ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు జరిగాయి. బాబాకు అభిషేకం చేసి పుష్పాలతో అలంకరించారు. రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు.

వాకాడు: మండలంలోని గంగన్నపాళెం, వాకాడు గ్రామాల్లో సాయిబాబా ఆలయాల్లో గురుపూర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం విశేష పూజా కార్యక్రమాలు ఆలయ పండితులు దివి అనంతాచార్యులు చేపట్టారు. విఘ్నేశ్వరపూజ, పుణ్యావాచకం, మండపారాధన, విశేష హోమాలు, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

సహకారం.. సమన్వయంతోనే అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా

పెళ్లకూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజాప్రతినిధులందరి సహకారం.. సమన్వయంతోనే మండలాభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా పేర్కొన్నారు. గురువారం పెళ్లకూరు ఎంపీడీవో సమావేశ మందిరంలో ఎంపీడీవో ప్రమీలారాణి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. సర్పంచులు, ఎంపీటీసీలు తెలియజేసిన సమస్యలను త్వరతగతిన పరిష్కరించాలని కోరారు. అనంతరం టీడీపీ మండల అధ్యక్షుడు, కొత్తూరు పంచాయతీ సర్పంచు సంచి కృష్ణయ్య, ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు, జీలపాటూరు పచాయతీ సర్పంచు కందమూడి శివకుమార్ మాట్లాడుతూ ఏ గ్రామానికి వెళ్లినా రెవెన్యూ సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతన్నారన్నారు. అధికారులు భూసమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, విద్య, ఉపాధి, విద్యుత్, ఐసీడీఎస్, ఉద్యాన తదితర శాఖల అధికారుల గైర్హాజరు కావడంపై ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ దృష్టికి తీసుకెళతామన్నారు. సమావేశంలో తహసీల్దార్ హరికృష్ణ, చెంబేడు, పెళ్లకూరు వైద్యాధికారులు చంద్రమోహన్‌రెడ్డి, జితేంద్ర, ఈవోపీఆర్డీ విజయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

చెంగాళమ్మ ఆలయంలో చండీయాగం


కలశ జలాలను తీసుకెళ్తున్న కొండేపాటి దంపతులు, ఎమ్మెల్యే విజయశ్రీ, నానాజీ, నెలవల సుబ్రహ్మణ్యం తదితరులు

సూళ్లూరుపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఆషాడ మాస గురుపౌర్ణమి సందర్భంగా గురువారం చెంగాళమ్మ ఆలయంలో మహా చండీయాగం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని యాగశాల మండపంలో అమ్మవారి ఉత్సవ విగ్రహం ఏర్పాటు చేసి వేదపండితులు, మంత్రోచ్చరణల నడుమ యాగం చేశారు. అనంతరం అమ్మవారికి 108 కలశ జలాలతో ఉభయకర్తలు కొండేపాటి గంగాప్రసాద్, కోమలి దంపతుల చేతుల మీదుగా అభిషేకం చేశారు. కొండేపాటి దంపతులకు దేవదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, పెంచలకోన ఆలయ మాజీ ట్రస్టుబోర్డు చైర్మన్ తానంకి నానాజీ, టీడీపీ నాయకులు తిరుమూరు సుధాకర్ రెడ్డి, కొక్కు శంకరయ్య, ఆకుతోట రమేష్, మాధవనాయుడు, బొమ్మన్ పళణి, సుదర్శన్ రావు తదితరులు పాల్గొన్నారు.

టిక్కెట్ కౌంటర్ ప్రారంభం

సూళ్లూరుపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): చెంగాళమ్మ ఆలయంలో భక్తుల సౌకర్యార్థం నూతన టిక్కెట్ కౌంటర్‌ను ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు. ఈ టికెట్ కౌంటర్‌ను గురువారం టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్, ఎమ్మెల్యే విజయశ్రీ ప్రారంభించారు. భక్తులు టిక్కెట్ కౌంటర్ సద్వినియోగం చేసుకోవాలని సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి కోరారు.

విద్యతోనే ఉజ్వల భవిత


విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి

చిల్లకూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్‌చక్రవర్తి అన్నారు. గురువారం మండలంలోని చిల్లకూరు, పారిచెర్లవారిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన తల్లిదండ్రులు - ఉపాధ్యాయుల సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించడంతో పాటు విద్యార్థుల సామర్థ్యాలను మెరుగు పరిచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. అనంతరం ఆయా పాఠశాలలో మొక్కలు నాటారు. చదువుల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మన్నెం శీనయ్య, డీవైఈవో సనత్‌కుమార్, ఎంఈవో రవూఫ్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రొయ్యలగుంటల పరిశీలన

కోట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సిద్ధవరం నుంచి తూర్పు కనుపూరుకు వెళ్లే మార్గంలో ఉన్న రొయ్యల గుంటలను గురువారం తహసీల్దారుతో పాటు పలు శాఖల అధికారులు పరిశీలించారు. రొయ్యల గుంటల నుంచి వచ్చే కలుషిత నీరు వరి పొలాల్లోకి ప్రవహించి భూములు ఉప్పుగా మారిపోతున్నాయని దువ్వూరు రాజగోపాలరెడ్డి అనే రైతు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దారు జయజయరావు, వ్యవసాయ, మత్స్యశాఖ, ఇరిగేషన్ అధికారులు సుచేంద్ర ప్రసాద్, రెడ్యానాయక్, మునిరత్నం తదితరులు రొయ్యల గుంటలను పరిశీలించారు. ఇక్కడ వాస్తవ పరిస్థితులను నివేదిక రూపంలో కలెక్టర్‌కు పంపుతామని తహసీల్దారు జయజయరావు చెప్పారు.

నేత్రపర్వంగా ఊంజల్ సేవ

శ్రీకాళహస్తి, జూలై 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం రాత్రి పౌర్ణమిని పురస్కరించుకుని ఊంజల్‌సేవ నేత్రపర్వంగా కొనసాగింది. మొదట ఆలయంలోని అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి ఉత్సవమూర్తులకు పలు అభిషేక పూజలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ స్వామి అమ్మవార్లను చప్పరాలపై అధిష్టింపజేసి ఊంజల్‌సేవ మండపానికి తీసుకువచ్చారు. పౌర్ణమి వెండి కాంతుల్లో ఊంజల్‌సేవలో ఊయల ఊగుతున్న స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యం

పాఠశాలల్లో ఘనంగా మెగా పీటీఎంలు







శ్రీకాళహస్తి పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, కాసాగార్డెన్ ప్రభుత్వ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, నారాయణవనంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు

శ్రీకాళహస్తి, జూలై 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే సుధీర్ అన్నారు. గురువారం పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అనేక సంస్కరణలు తీసుకువచ్చిందన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడమే మంత్రి లోకేశ్ లక్ష్యమన్నారు. అనంతరం పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థికి రూ.20వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం టి.వెంకటయ్య, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నారాయణవనం (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. గురువారం నారాయణవనంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కూటమి ప్రభుత్వం ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మౌలిక వసతులు కల్పిస్తోందన్నారు. తెలిపారు. పిల్లలు చదువుతున్న తీరును తల్లిదండ్రులు నిశితంగా గమనించాలని, విద్యార్థులకు ఉన్న ఆసక్తి మేరకు సబ్జెక్టు బోధన ఉండాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. జడ్పీటీసీ సభ్యుడు సుమన్‌కుమార్, తహసీల్దార్ జయరాములు, ఎంపీడీవో అరుణ, ఎంఈవోలు కస్తురయ్యా, జనార్దన రాజు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని 47 పాఠశాలల్లో గురువారం పండుగ వాతావరణంలో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగులు జరిగాయి. ఈ సందర్భంగా పలు పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని పలువురు వక్తలు అన్నారు. మెగా పీటీఎం 2.0ను పురస్కరించుకుని మండలంలోని పలు పాఠశాలలో సమావేశాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. సంతవేలూరు జడ్పీ, గోవర్ధనపురం ఉన్నత పాఠశాలల్లో వేడుకలు జరిగాయి.

ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలను ఘనంగా నిర్వహించారు. ఏర్పేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం మునిలక్ష్మి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పేరెంట్స్ కమిటీ చైర్మన్ సురేంద్రబాబు హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. పంగూరు, బండారుపల్లి ప్రభుత్వ పాఠశాలలు, పాపానాయుడుపేట జూనియర్ కళాశాలలో జరిగిన పీటీఎం సమావేశాలు జరిగాయి.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): పాఠశాల అభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఎంఈవో - 2 మునిసుబ్రమణ్యం తెలిపారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ డేను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం విద్యకు ఇచ్చే ప్రాధాన్యాన్ని వివరించారు. అనంతరం వివిధ పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. హెచ్‌ఎంలు రమణయ్య, వాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- విద్యతోనే పేదరికాన్ని దూరం చేయవచ్చని తొట్టంబేడు మండల టీడీపీ అధ్యక్షుడు రావిళ్ల మునిరాజానాయుడు అన్నారు. గురువారం తొట్టంబేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపాలన్నారు. హెచ్‌ఎం మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.
- వ్యసనాలకు దూరంగా ఉంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి అన్నారు. పట్టణంలోని కాసాగార్డెన్ ప్రభుత్వ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో గురువారంనిర్వహించిన మెగాపేరెంట్స్, టీచర్స్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మొబైల్ ఫోన్లకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకుని చదవాలన్నారు. తద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ కమిషనర్ సంజీవకుమార్, రెండో పట్టణ సీఐ నాగార్జునరెడ్డి, ప్రిన్సిపాల్ జయశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నారని ఎమ్మెల్యే సుధీర్ సతీమణి రిషితారెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ... ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం, విద్యాపరంగా సంపూర్ణ అభివృద్ధి సాధించడం లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తోందని ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. గురువారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పండుగ వాతా వరణంలో జరిగాయి. సత్యవేడు బాలికల గురుకుల పాఠశాలలో జరిగిన ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేశారు. తరగతుల వారీగా విద్యార్థుల ప్రగతిని వివరించారు. అనంతరం పాఠశాలల ఆవరణలో తల్లి పేరుతో విద్యార్థుల చేత మొక్కలు నాటించారు. తల్లిదండ్రులకు మ్యూజికల్ చైర్, టగ్ ఆఫ్ వార్, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మధ్యాహ్నం ఆత్మీయ సమావేశం నిర్వహించి పాఠశాలల ప్రగతి, సమస్యలపై చర్చించారు. ఎంజేపీబీ బాలుర గురుకుల పాఠశాలలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో గత విద్యా సంవత్సరంలో అత్యుత్తమ మార్కులు సాధించిన ఎనిమిది మంది విద్యార్థులకు నగదు బహుమతులను అందించారు.

విద్యార్థుల చదువుపై బాధ్యత వహించండి



ఆదర్శ పాఠశాలలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌రెడ్డి

కేవీబీపురం, జూలై 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అభివృద్ధి చెందాలంటే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సహకరించాలని టీడీపీ సత్యవేడు నియోజకవర్గ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శంకర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, ఆదర్శ పాఠశాలలో జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గతంలో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం, బ్యాగులు, షూస్ కొనడానికి తల్లిదండ్రులు ఇబ్బంది పడేవారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పాఠశాల తెరచిన రోజునే విద్యాసామగ్రిని అందించిందన్నారు. తిరుపతి పార్లమెంటు తెలుగురైతు అధ్యక్షుడు గోపీనాథ రెడ్డి, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునస్వామియాదవ్, తిరుపతి పార్లమెంట్ ఉపాధ్యక్షులు సతీష్‌నాయుడు, రాష్ట్ర వాణిజ్య విభాగ ఉపాధ్యక్షుడు పద్మనాభరాజు, పిచ్చాటూరు మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, ప్రత్యేక అధికారి సుకన్య, ప్రిన్సిపాల్ సౌజన్య, ఎస్‌ఎంసీ కమిటీ అధ్యక్షుడు సురేష్‌రెడ్డి సుభాషిణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కేజీబీవీ విద్యార్థినులకు, ఆదర్శ పాఠశాల వసతి గృహ విద్యార్థులకు శంకర్‌రెడ్డి దుప్పట్లను పంపిణీ చేశారు. త్వరలో సీసీ కెమెరాలు, కంప్యూటర్లు ఏర్పాటు చేయిస్తానన్నారు.

భారీ వాహనాలను నిషేధించండి: డీపీవో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



దెబ్బ తిన్న రోడ్డును పరిశీలిస్తున్న డీపీవో తదితరులు

రేణిగుంట జూలై 10:(ఆంధ్రజ్యోతి): పట్టణంలో భారీ వాహనాల రాకపోకలను నిషేధించాలని డీపీవో ఆదేశించారు. 'భారీ వాహనాలతో వీధులు ధ్వంసం' అనే కథనం ఈనెల 10న ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైంది. దీనిపై డీపీవో సుశీలాదేవి స్పందించారు. గురువారం ఉదయం పట్టణంలోని బుగ్గవీధిలో దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యాలయానికి చేరుకుని పట్ట ణంలో భారీ వాహనాలను అనుమతించ వద్దని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అంతకుముందు పట్టణంలోని పలు వీధుల్లో తడి, పొడి చెత్త సేకరణపై స్థానికులను ఆరా తీశారు. దీంతో కొందరు చెత్తను సక్రమంగా సేకరించడం లేదని ఆమె దృష్టికి తీసుకొచ్చారు. దీంతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌పై అసహనం వ్యక్తం చేశారు. కొన్ని వీధుల్లో ట్రాక్టర్ వెళ్లలేని పరిస్థితులు ఉన్నాయని, 20 తోపుడు బండ్లు ఉపయోగించాలని ఆదేశించారు. పంచాయతీ పంపు ఆపరేటర్లను పారిశుధ్య పనులకు ఉపయోగించుకోవాలని ఆదేశించారు. అలాగే పట్టణంలో ఉదయం పూట ఆర్వో వాటర్ విక్రయదారులు తమ వాహనాలకు స్పీకర్లు పెట్టుకుని పెద్ద శబ్దంతో పాటలు పెడుతున్నట్టు పలువురు డీపీవో దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆమె వెంటనే నీటి విక్రయదా రులతో సమావేశం ఏర్పాటుచేసి అవగాహన కల్పించాలని చెప్పారు. ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రభురావు, పంచాయతీ కార్యదర్శి మాధవి తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువ నిర్మించండి

రైల్వే కమిటీ సమావేశంలో తీర్మానం

రేణిగుంట జూలై 10:(ఆంధ్రజ్యోతి): రేణిగుంట రైల్వే స్టేషన్ ఆవరణలో ఉన్న స్కూటర్ పార్కింగ్‌ను తరలించి ఆ ప్రాంతంలో మురుగు కాలువ నిర్మించాలని రైల్వే కమిటీ సమావేశంలో సభ్యులు నిర్ణయం తీసుకున్నారు. గురువారం రైల్వే స్టేషన్‌లోని స్టేషన్‌మాస్టర్ సమావేశ మందిరంలో రైల్వే కమిటీ సమావేశం జరిగింది. చిన్నపాటి వర్షానికే రైల్వేస్టేషన్ ఆవరణ మురుగు పొంగిపొర్లడం, దుర్వాసన వెదజల్లుతుండడంతో తిరుమలకు వెళ్లే భక్తులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఈక్రమంలో స్కూటర్ పార్కింగ్‌ను తరలించి అక్కడ కాలువ నిర్మించాలని తీర్మానించారు. సర్పంచ్ నాగేశం, స్టేషన్ మాస్టర్ శేషగిరినాథ రెడ్డి, కమిటీ సభ్యులు బి.డి. బాలాజీ, మధుకర్ పాల్గొన్నారు.

మూగ జీవాల మౌన రోదన



సత్యవేడు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పొలంలో పడి పంటను మేస్తున్నాయంటూ రైతులు మూగ జీవాలను కట్టి పెట్టేశారు. జీవాల యజమానులు వాటిని విడిపించేందుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో ఐదు రోజులుగా మూగ జీవాలు ఎక్కడికీ కదల్లేక మౌనంగా రోదిస్తున్నాయి. నాగలాపురం మండలం టీపీ పాళెంకు చెందిన పాడి రైతుల ఆవులు, ఎద్దులు సత్యవేడు మండలం కన్నావరంలోని పొలాల్లో దూరి మేస్తున్నాయంటూ ఐదు రోజుల క్రితం వాటిని కట్టేశారు. విషయం తెలిసి కూడా పాడి రైతులు తమ జీవాలను విడిపించుకునేందుకు ప్రయత్నించక పోవడంతో ఐదు రోజులుగా పొలాల్లోనే ఉన్నట్లు సమాచారం. ఇటు పాడి రైతులు తమ జీవాలను విడిపించుకోక, అటు రైతులు వాటిని వదిలి పెట్టక పోవడంతో జీవాలు కదల్లేక ఇబ్బంది పడుతున్నాయి. ఈ విషయమై కన్నవరం రైతులు పలువురు సత్యవేడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది కాగా టీపీపాళెం రైతులు తమ జీవాలను కట్టిపెట్టక రోడ్లపై వదిలేస్తుండడంతో అవి రాత్రుల్లో రోడ్లపై తిరుగడం వల్ల పరిసర గ్రామాల్లోని రైతులు, గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పలుమార్లు పోలీసులు టీపీపాళెం పాడి రైతులకు కౌన్సిలింగ్ కూడా ఇచ్చారు.

తేలుకాటుతో ఏడేళ్ల బాలిక మృతి



గేక్షిత (ఫైల్‌ఫొటో)

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాంపాళెం దళితవాడలో తేలుకాటుతో ఏడేళ్ల బాలిక మృతి చెందింది. అక్కరపాకం వెంకటేశు, నవీన దంపతుల కుమార్తె గేక్షిత(7). మండల కేంద్రంలోని శ్రీనివాసతేజ ప్రైవేటు పాఠశాలలో 2వ తరగతి చదువుతోంది. రెండు రోజుల క్రితం ఇంటిపైన ఆడుకుంటుండగా తేలు కుట్టింది. గమనించిన తల్లిదండ్రులు శ్రీకాళహస్తిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయా కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందింది.

కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ఘనస్వాగతం



రేణిగుంట జూలై 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజీవ్‌కు తిరుపతి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. శ్రీవారి దర్శనార్థం గురువారం మధ్యాహ్నం ఇండిగో విమానంలో తిరుపతి విమానాశ్రయం చేరుకున్న ఆయనకు టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

శ్రీకాళహస్తి, జూలై 10(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదలో గుర్తు తెలియని యువకుడు(35) మృతి చెందాడు. ఈ ఘటన గురువారం తొట్టంబేడు మండలంలోని మల్లిగుంట రోడ్డులో వెలుగు చూసింది. పొయ్య నుంచి మల్లిగుంటకు వెళ్లే రోడ్డులో గుర్తు తెలియని వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో గుర్తు తెలియని యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు గుర్తించి తొట్టంబేడు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడి వివరాల కోసం ఆరా తీశారు. గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిమార్చురీకి తరలించారు.

వ్యక్తిత్వ వికాస శిక్షణలో పట్టాభిరామ్‌ది తనదైన ముద్ర

తిరుపతిరూరల్, జూలై10(ఆంధ్రజ్యోతి): వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాల పెంపు శిక్షణలో దివంగత ప్రముఖ సైకాలజిస్ట్ బీవీ పట్టాభిరామ్ తనదైన ముద్ర వేశారని సైకాలజిస్ట్ ఎన్‌బీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఎమ్మార్ పల్లె కూడలిలోని కౌటిల్య ఇన్‌స్టిట్యూట్‌లో గురువారం పట్టాభిరామ్ సంతాపసభ నిర్వహించారు. పోటీపరీక్షలకు ప్రిపేర్‌అవుతున్న విద్యార్థులు, సంస్థ డైరెక్టర్ శ్రీధర్, అధ్యాపకులతో ఆయన కలసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, యువత, వివిధవర్గాల ప్రజలకు వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాలపెంపునకు ఆయన ఎనలేని కృషి చేశారని కీర్తించారు. సంస్థ డైరెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసంపై ఆయన రూపొందించిన పుస్తకాలను నేటి యువత, విద్యార్థులు అధ్యయనం చేయాలని ఆకాంక్షించారు. పలువురు విద్యార్థులకు పట్టాభిరామ్ రచించిన పుస్తకాలను బహుమతిగా అందించారు.

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు



శ్రీకాళహస్తి, జూలై 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు షిర్డీ సాయిబాబా మందిరాల్లో గురువారం గురుపౌర్ణిమ వేడుకలను నిర్వహించారు. సాయినామ స్మరణతో ఆలయాలు మారుమోగాయి. విశేష అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలు భక్తులకు అందజేశారు. పట్టణంలోని బహదూరుపేట, కర్నాల వీధి, బాబుఅగ్రహారం ప్రాంతాల్లో సాయినాథుని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జామున ఆలయాలను పుష్పాలంకరణ, మామిడితోరణాలతో సుందరంగా అలంకరించారు. ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణలో సాయిబాబా నిలయాలు దేదీప్యమానంగా వెలిగాయి. ఆయా ఆలయాల కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): జీవితంలో మొదటి గురువు కన్నతల్లి అని పలువురు ఉద్ఘాటించారు. మండలంలో గురుపౌర్ణమిని పురస్కరించుకుని పలు ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. బండారుపల్లిలోని శ్రీకృష్ణ ఆశ్రమం, ఏర్పేడు రామాలయం, రాజులపాళెంలో శ్రీకృష్ణ ఆశ్రమంలో విశేష పూజలు చేపట్టారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఆలయాల్లో గురుపూర్ణిమ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బాలనాగలామ్మ ఆలయం నుంచి పాలబిందెలతో ఊరేగింపు చేపట్టారు. అనంతరం బాల నాగాలమ్మ, సదవాలమ్మ వారికి గ్రామోత్సవం నిర్వహించారు. శ్రీకాళహస్తి మార్గంలోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, అన్నదానం చేశారు.

దక్షిణామూర్తికి ఆగమోక్తంగా గురుపౌర్ణమి పూజలు



శ్రీకాళహస్తి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మేధో గురు దక్షిణా మూర్తికి గురు పౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠాపన అనంతరం వినాయక, కలశ పూజలు, వైదిక కతృవులు చేపట్టారు. అనంతరం స్వామివారిని పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో అభిషేకించారు. సుగంధ భరిత పూలు, స్వర్ణాభరణాలతో అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. పర్వత, చక్ర, కుంభ, మహామంగళ హారతులిచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

చెక్‌పవర్ రద్దు పొడగింపు

వరదయ్యపాళెం, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరానగర్ పంచాయతీలో జరిగిన నిధుల దుర్వినియోగం విషయంలో సర్పంచ్ చెక్ పవర్ రద్దు పొడిగిస్తున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. సామాజిక కార్యకర్త ఆశా పీజీఆర్‌ఎస్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు సూళ్ళూరుపేట డీఎల్‌పీవో, శ్రీకాళహస్తి డీఎల్‌పీవో సంయుక్త విచారణలో నిధుల దుర్వినియోగం జరిగినట్లు తేలిందన్నారు. దీనిపై 15రోజుల్లో వివరణ ఇవ్వాలని కోరగా ఇంత వరకు సమాధానం లేకపోవడంతో చెక్‌పవర్ రద్దును పొడిగిస్తున్నట్లు తెలిపారు.

నిత్యాన్నదానానికి విరాళం

శ్రీకాళహస్తి, జూలై 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి పలువురు భక్తులు విరాళం అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన కస్తూరి కిరణ్ రూ.80వేలు, విజయనగరానికి చెందిన అనిల్ రూ.25,116 విరాళంగా అందజేశారు.

నాగంపల్లిలో 'తొలిఅడుగు'



ఇసుకతాగేలిలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ నాయకులు

ఏర్పేడు, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగంపల్లిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల వివరాలను కరపత్రాల రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో గురవారెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, మునిరెడ్డి, సుబ్బరామిరెడ్డి, మహానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇక ఇసుకతాగేలిలో కూడా సుపరిపాలనలో తొలి అడుగు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు పేరం నాగరాజునాయుడు, పేరం ధనంజయులునాయుడు, మోహన్‌నాయుడు, చంద్రారెడ్డి, రవినాయుడు, కృష్ణవేణి, రేవతి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల విలీనం వద్దు

కేవీబీపురం, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని గురుకులకండ్రిగ గ్రామానికి చెందిన ప్రాథమిక పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం ఎంఈవోలు లక్ష్మీపతి, రవికుమార్‌ను కలిసి తమ గ్రామంలోని పాఠశాలను విలీనం చేయవద్దని వారికి వినతిపత్రం అందజేశారు. సుమారు 4.5 కిలోమీటర్ల దూరంలో ఉన్న అంజూరు పాఠశాలకు తమ పిల్లలను పంపించలేమన్నారు.

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో ఉన్న బడిలో ఉన్న విద్యార్థులను విలీనం చేయొద్దంటూ అప్పంబట్టులో తల్లిదండ్రులు నిరసన వ్యక్తం చేశారు.

గెస్ట్ టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతిరూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలం జూపార్క్‌రోడ్డులోని ఉదయమాణిక్యం మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో గెస్ట్ టీచర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ కె.రేష్మ పేర్కొన్నారు. హిందీ(పీజీటీ), ఇంగ్లీషు(టీజీటీ) పోస్టులకు అర్హులైన మహిళా అభ్యర్థులు ఈనెల19వ తేదీలోపు పాఠశాలలో దరఖాస్తులు అందించాలని కోరారు.

స్మార్ట్‌మీటర్లను ధ్వంసం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న మురళి

శ్రీకాళహస్తి, జూలై 10(ఆంధ్రజ్యోతి): నివాస గృహాలకు స్మార్ట్‌మీటర్లు పెడితే ధ్వసం చెయ్యాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి పిలుపునిచ్చారు. పట్టణంలోని మార్కెట్‌యార్డులో గురువారం సివిల్ సప్లైస్ శాఖ హమాలీ వర్కర్ల యూనియన్ మహాసభ జరిగింది. ఆయన మాట్లాడుతూ సీపీఐ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేద్దామన్నారు. కమ్యూనిస్టు బలహీన పడితే మతోన్మాదం పెరుగుతుందన్నారు. వైసీపీ హయాంలో దోపిడీకి పాల్పడిన వారే కూటమి అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ కండువా వేసుకుని అక్రమాలకు తెరలేపారన్నారు. ఈ సదస్సులో జనమాల గురవయ్య, గోపి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల పరిసరాల్లో పొగాకు ఉత్పత్తులు అమ్మితే చర్యలు

శ్రీకాళహస్తి, జూలై 10(ఆంధ్రజ్యోతి): పాఠశాలల సమీపంలో పొగాకు ఉత్పత్తులు అమ్మితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ నరసింహమూర్తి హెచ్చరించారు. పట్టణంలోని ముత్యాలమ్మ గుడి వీధిలో పలు పాఠశాలల సమీపంలో ఉన్న దుకాణాలను గురువారం తనిఖీ చేశారు. బీడీలు, సిగరెట్లు విక్రయిస్తున్నట్టు గుర్తించారు. వారికి జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో సీఐ గోపి, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

శ్రీకాళహస్తి, జూలై 10(ఆంధ్రజ్యోతి): గురు పౌర్ణమిని పురస్కరించుకుని జడ్పీ ఉన్నత బాలుర ఉన్నత పాఠశాల 1994కు చెందిన విద్యార్థులు తేరువీధిలోని బస్టాండు వద్ద భక్తులకు అన్నదానం చేశారు. పట్టణంలోని పెండ్లిమండపం వద్ద జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత ఆధ్వర్యంలో గురువారం డొక్కా సీతమ్మ స్ఫూర్తితో అన్నదానం చేశారు. తోట గణేష్, నితీష్‌కుమార్, లక్ష్మి, రాజ్యలక్ష్మి, మాలతి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి జన్మదినం పురస్కరించుకుని పట్టణంలోని ఓంకార మఠంలో ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి హేయం

ఎమ్మెల్యే సుధీర్

శ్రీకాళహస్తి, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై వైసీపీ అల్లరిమూకలు దాడి చేయడం హేయమైన చర్య అని ఎమ్మెల్యే సుధీర్ అన్నారు. వైసీపీ అధినేత జగన్ అధికారంలో ఉండగా ఏ రోజూ రైతుల కోసం గడప దాటలేదన్నారు. ఇప్పుడు అనవసర రాద్ధాంతాలు చేస్తూ జర్నలిస్టులపై దాడులకు పాల్పడటం సైకోయిజానికి నిదర్శమన్నారు. ఆయన తండ్రి, దివంగత సీఎం వైఎస్ హుందాగా నడుచుకున్నారని గుర్తు చేశారు. అయితే జగన్ మాత్రం అందుకు విరుద్ధంగా మతి స్థిమితంకోల్పోయిన వ్యక్తిలాగా మృతదేహాల వద్దకు వెళ్లి వెకిలినవ్వు నవ్వడం, అరాచకంగా వ్యవహరించడం సాగిస్తున్నారన్నారు.

మధు... ఇకనైనా బుద్ధి మార్చుకో!

పరిపాలన దక్షతకు మారుపేరైన సీఎం చంద్రబాబును కనీస అంశాలపై జ్ఞానం లేని మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సలహాలు ఇవ్వడం హాస్యాస్పదం అన్నారు. మామిడికాయలను ఆలయాల నిధులతో కొనుగోలు చేసి భక్తులకు పంచాలంటూ సీఎంకు మధుసూదన్‌రెడ్డి సలహా ఇవ్వడం సిగ్గుచేటన్నారు. అసలే రైతులు అల్లాడిపోతుంటే రూ.1లెక్కన కొనుగోలు చేయాలని మధుసూదన్‌రెడ్డి బుర్రలేని వ్యాఖ్యలు చేయడం ఆయనకే చెందుతుందన్నారు.